విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు..
PEN SATTA Telugu Daily



సంపుటి : 4 | సంచిక :7 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 2 జూన్ 2026 | పేజీలు : 08 | వెల : 03
Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే
# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు



- వాళ్లు విధ్వంసం చేశారు.. బాగు చేసేందుకు మేము కష్టపడుతున్నాం
- ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారు
- పవర్ కోసం కోడికత్తి, గులకరాయి డ్రామాలు కూడా ఆడారు
- పేదల సేవలో కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- ఆ పార్టీ నేతలు అసత్య ప్రచారాలే పనిగా పెట్టుకున్నారని మండిపాటు

**చామవరం**

వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తే బాగు చేసేందుకు తాము రేయింబవళ్లూ కష్టపడాల్సి వస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో సోమవారం నిర్వహించిన పేదల సేవలో కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని బాగు చేసేందుకు రాత్రింబవళ్లు మేం పనిచేస్తున్నాం. గత పాలకులు మాత్రం విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారు. సుపరిపాలనను వెనక్కు లాగేందుకు గొడ్డలి పార్టీ కుట్రలు కుతంత్రాలు పన్నుతోంది. అందుకే ప్రస్తుతం ఉన్న ప్రతిపక్షాన్ని గొడ్డలి పార్టీ అంటున్నాం. బాబాయి వివేకానందరెడ్డిని హత్యచేసి గుండెపోటు అన్నారు. పోస్టుమార్టం తర్వాత తెలిసింది గొడ్డలితో నరికి చంపారని. మానాన్న చనిపోయారు ఇప్పుడు చిన్నాన్న కూడా చంపేశారని ఎక్కడికక్కడ డ్రామాలు ఆడారు. ఒక్క ఛాన్స్ అన్నారు మోసం చేశారు. కోడికత్తి, గులకరాయి డ్రామాలు కూడా ఆడారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు వివరాలు 2లో..



## ఈ సారి యోగా
# రెండు వారాలు

- కోటి మందిని భాగస్వాములను చేసేలా చర్యలు
- రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఏర్పాట్లు
- ఏపీ యోగా ప్రచార పరిషత్ ఏర్పాటుకు సీఎం ఆమోదం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి**

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను రాష్ట్రంలో 'యోగాంధ్ర--2026' పేరుతో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్ అనే విశిష్ట నినాదంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) వివరాలు 2లో..




## దేశంలో జల వనరుల నిర్వహణ కోసం
# ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్

- దేశంలో కొత్త జల పరిశోధన కార్యక్రమాలకు నాంది
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో ఒప్పందం కుదుర్చుకున్న కేంద్ర జలశక్తి శాఖ
- అగ్రిమెంట్‌పై సంతకాలు చేసిన ఇరువర్గాలు



## బీజేపీపై అన్నామలై
# అసంతృప్తి

- త్వరలోనే కొత్త పార్టీ- రెండు రోజుల్లో క్లారిటీ!
- తమిళనాట రాజకీయాల్లో కొత్త ప్రచారం
- బీజేపీని వీడి కొత్త పార్టీని స్థాపించనున్న అన్నామలై?
- దీనిపై ఆయన రియాక్షన్ ఏంటంటే?

# జమ్ముకశ్మీర్‌లో తగ్గిన ఉగ్రవాదం!

- మే నెలలో 'నో కిల్లింగ్స్?'
- గత 30 ఏళ్లలో మొదటిసారి ప్రశాంతత!
- జమ్ముకశ్మీర్‌లో 4,011 నుంచి 12కు పడిపోయిన వార్షిక మరణాలు
- ఉగ్రవాదం తగ్గిందా?



# మారుతున్న రియల్ ఎస్టేట్ ముఖచిత్రం...

- విశాఖ సహా ఈ 8 నగరాలపైనే అందరి దృష్టి!
- రియల్ ఎస్టేట్ పెట్టుబడులు మెట్రోల నుంచి టైర్-2 నగరాలకు మళ్లుతున్నాయి
- మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పథకాలు ఈ నగరాల పురోగతికి కారణం
- తక్కువ ధరల్లో ఆస్తులు, అధిక రాబడికి ఆస్కారం ఉండటంతో పెరుగుతున్న ఆసక్తి
- విశాఖపట్నం సహా దేశంలోని 8 నగరాలు రియల్ ఎస్టేట్ వృద్ధికి కేంద్రాలుగా మార్పు




# ఏఐ హబ్‌గా విశాఖ ఎదుగుదల



- ఎయిర్‌ట్రంక్ సీఈవోతో మంత్రి లోకేశ్ భేటీ
- ఏపీలో పెట్టుబడులకు ఆహ్వానం
- వివిధ దేశాల్లో డేటా సెంటర్లు నిర్వహిస్తున్న హైపర్ స్కేల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్
- ఏఐ, డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా వైజాగ్ ఆవిర్భవిస్తోందన్న మంత్రి లోకేశ్

**ముంబై**

ప్రపంచవ్యాప్తంగా హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ ఎయిర్‌ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ముంబైలో సమావేశమయ్యారు. ఆసియా పసిఫిక్, మిడిల్ ఈస్ట్, ఆస్ట్రేలియా, జపాన్, మలేషియా, హాంకాంగ్, సింగపూర్‌లలో భారీ డేటా సెంటర్లను ఎయిర్‌ట్రంక్ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ 'ఏఐ, వివరాలు 2లో..



## దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో
# రాజ్యసభ ఎన్నికలు

- షెడ్యూల్ విడుదల
- దేశవ్యాప్తంగా 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ద్వైవార్షిక ఎన్నికలు
- బీహార్, కర్ణాటకలో శాసనమండలి స్థానాలకు కూడా ఎన్నికలు
- జూన్ 18న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా నోటిఫికేషన్ జారీ

## గ్రామాల్లో వనరులు వాడుకుంటూ పన్నులు
# కట్టకపోవడమేంటి?



- పరిశ్రమలు పన్ను చెల్లించకపోవడంపై పవన్ ఆగ్రహం
- పంచాయతీ పన్నులు వసూలైతే రూ.5,400 కోట్లకు పైగా వస్తాయని వెల్లడి
- రాజకీయ ఒత్తిళ్లున్నా పన్నుల విషయంలో ముందుకెళ్లాలని అధికారులకు ఆదేశం

**అమరావతి**

పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల పన్నుల వసూళ్లపై అధికారులతో సమీక్షించారు. పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి పన్ను వసూళ్లు ఎందుకు సరిగా ఉండటం లేదని అధికారులను అడిగారు. రాజధాని నుంచి ఉన్నతాధికారులతో కలిసి పవన్ నిర్వహించిన సమీక్షలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అధికారులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. తమ ప్రాంతాల్లో పన్ను వసూళ్ల వివరాలను వివరాలు 2లో..

# మారుతున్న రియల్ ఎస్టేట్ ముఖచిత్రం



భారత రియల్ ఎస్టేట్ రంగంలో ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు పెట్టుబడిదారులకు స్వర్గధామాలుగా ఉన్న ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల నుంచి దృష్టి నెమ్మదిగా టైర్-2 నగరాల వైపు మళ్లుతోంది. మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పెరుగుతున్న ఉపాధి అవకాశాలతో ఈ నగరాలు రియల్ ఎస్టేట్ వృద్ధికి కొత్త చోదక శక్తులుగా మారుతున్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ నగరాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా భవిష్యత్తులో మంచి మూలధన వృద్ధి, అద్దె రూపంలో అధిక రాబడి పొందేందుకు అపారమైన అవకాశాలున్నాయి.

### టైర్-2 నగరాల వైపే ఎందుకు?

దేశవ్యాప్తంగా టైర్-2 నగరాల్లో కనిపిస్తున్న రియల్ ఎస్టేట్ బూమ్‌కు అనేక కారణాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీస్ మిషన్, అమృత్ వంటి పథకాల కింద ఈ నగరాల్లో మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయి. కొత్త మెట్రో లైన్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, విమానాశ్రయాల నిర్మాణం వాటి రూపురేఖలను మార్చేస్తున్నాయి. పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరగడం, ప్రజల జీవనశైలిలో మార్పులు రావడం కూడా గిరాకీని పెంచుతోంది. అన్నింటికంటే ముఖ్యంగా, మెట్రో నగరాలతో పోలిస్తే ఇక్కడ ఆస్తుల ధరలు అందుబాటులో ఉండటం పెట్టుబడిదారులను ఎక్కువగా ఆకర్షిస్తోంది. నివాస గృహాలతో పాటు వాణిజ్య సముదాయాలకు కూడా డిమాండ్ ఊపందుకుంది.

### వృద్ధి పథంలో దూసుకెళుతున్న 8 నగరాలు

1. ఇండోర్ (మధ్యప్రదేశ్): దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా ఖ్యాతి గాంచిన ఇండోర్, బలమైన ఆర్థిక వృద్ధి, అద్భుతమైన మౌలిక సదుపాయాలతో దూసుకుపోతోంది. సూపర్ కారిడార్, విజయ్ నగర్ వంటి ప్రాంతాలు హాట్‌స్పాట్‌లుగా ఉన్నాయి.
2. లక్నో (ఉత్తరప్రదేశ్): మెట్రో విస్తరణ, ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంతో లక్నో వేగంగా రూపాంతరం చెందుతోంది. గోమతి నగర్ ఎక్స్‌టెన్షన్, షహీద్ మార్గం వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జోరందుకున్నాయి.
3. జైపూర్ (రాజస్థాన్): ఢిల్లీ-ముంబై పారిశ్రామిక కారిడార్‌లో వ్యూహాత్మకంగా ఉండటం జైపూర్‌కు కలిసొస్తోంది. ఇక్కడ నివాస, అద్దె గృహాలకు డిమాండ్ బాగా పెరిగింది.
4. కోయంబత్తూరు (తమిళనాడు): దక్షిణ భారతదేశంలో తయారీ, ఐటీ రంగాలకు కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. అవినాశి రోడ్, శరవణంపట్టి కారిడార్లు కీలక ప్రాంతాలుగా ఉన్నాయి.
5. నాగ్‌పూర్ (మహారాష్ట్ర): ముంబై-నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వే ఈ నగరం దశను మార్చింది. లాజిస్టిక్స్, పారిశ్రామిక కేంద్రాల ఏర్పాటుతో నివాస, అద్దె మార్కెట్లలో బలమైన వృద్ధిని నమోదు చేస్తోంది.
6. భువనేశ్వర్ (ఒడిశా): తూర్పు భారతదేశంలో విద్య, ఐటీ, పరిపాలనా కేంద్రంగా ఎదుగుతోంది. స్మార్ట్ సిటీ కార్యక్రమాలు ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిస్తున్నాయి.
7. సూరత్ (గుజరాత్): వస్త్ర, వజ్రాల పరిశ్రమలకు ప్రసిద్ధి చెందిన సూరత్‌లో పట్టణీకరణ వేగంగా సాగుతోంది. అందుబాటు ధరలు, స్థిరమైన జనాభా పెరుగుదల ఇక్కడి వృద్ధికి కారణాలు.
8. విశాఖపట్నం (ఆంధ్రప్రదేశ్): పోర్ట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, విస్తరిస్తున్న ఐటీ రంగం, పెరుగుతున్న పారిశ్రామిక కార్యకలాపాలు విశాఖను తూర్పు తీరంలో ఒక ఆకర్షణీయమైన నగరంగా నిలుపుతున్నాయి. మౌలిక సదుపాయాల మెరుగుదల ఇక్కడి రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది.

మొత్తంమీద, ఇప్పటికే సంతృప్త స్థాయికి చేరిన మెట్రో నగరాలతో పోలిస్తే ఈ టైర్-2 నగరాలు తక్కువ ప్రవేశ ధరలు, బలమైన వృద్ధి సామర్థ్యం, మెరుగైన జీవన ప్రమాణాలను అందిస్తున్నాయి. దీర్ఘకాలిక రాబడులను ఆశించే పెట్టుబడిదారులు ఇప్పుడు ఈ నగరాల వైపే చూస్తున్నారు.

# బీజేపీపై అన్నామలై అసంతృప్తి




తమిళనాడు రాజకీయాల్లో కొత్త చర్చ ప్రారంభమైంది. ఆ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె అన్నామలై కొత్త రాజకీయ పార్టీ స్థాపించనున్నారంటూ ప్రచారం మొదలైంది. ఈ ఊహాగానాల నడుమ అన్నామలై సోమవారం దిల్లీ బయల్దేరారు. ఈ క్రమంలో ఆయన చెన్నై ఎయిర్?పోర్టులో కనిపించారు. దీంతో కొత్త పార్టీ గురించి మీడియా ప్రశ్నించగా, రెండు రోజుల్లో దీనిపై సమాధానం ఇస్తానని అన్నామలై చెప్పారు. దీంతో తమిళనాట రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.

### వాల్ పోస్టర్లతో మొదలైన ప్రచారం!

తాజాగా కోయంబత్తూరు వీధుల్లో అన్నామలై ఫొటోలతో ఉన్న పోస్టర్లు వెలశాయి. దానిపై 'మైండ్స్ గేవ్ నో లిమిట్స్' అని రాసి ఉంది. దీంతో అన్నామలై కొత్త పార్టీ ప్రచారం షురూ అయ్యింది. దీంతోపాటు ఆయన మద్దతుదారుల కార్యకలాపాలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. అన్నామలై అన్బు కూట్టం తరఫున ఆయన మద్దతుదారులు కొత్త సభ్యులను, ఆఫీస్ బేరర్లను చేర్చుకునే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. అటు జాతీయ మీడియా కూడా త్వరలోనే అన్నామలై ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించే అవకాశం ఉందని పేర్కొంది.

### కాంగ్రెస్ నేత ట్వీట్?తో బలం!

ప్రస్తుతం కోయంబత్తూరులోనే తమిళనాడు బీజేపీ సెంట్రల్ కమిటీ సమావేశం జరుగుతుండగా అన్నామలై హాజరుకాలేదు. వరుసగా రెండు కీలక సమావేశాలకు గైర్హాజరుకావడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై రకరకాల చర్చలు నడుస్తున్నాయి. ఈ పరిణామాలపై అన్నామలై ఇంకా స్పందించలేదు. అయితే కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం చేసిన ఒక ట్వీట్ ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది. తమిళనాడులో త్వరలో మరో రాజకీయ పార్టీ రాబోతోందని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆ పార్టీ పేరులో ఆసక్తికరమైన లాజిక్ ఉందని రాసుకొచ్చారు.

### ఆ ఆదేశాలపై అసంతృప్తి!

ఈ విద్యాసంవత్సరం నుంచే 9వ తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలపై అన్నామలై అసంతృప్తి వ్యక్తం చేశారు. జులై ఒకటి నుంచి సీబీఎస్ఈ పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులకు మూడు భాషలను తప్పనిసరి చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నామలై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కోరారు. గతంలో నిర్ణయించినట్లుగానే 2029- 30 విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. హఠాత్తుగా కొత్త భాషను నేర్చుకోవాల్సి రావడం తమిళనాడు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుందని ఎక్స్‌లో పోస్టు చేశారు. అటు అసెంబ్లీ ఎన్నికలకు ముందు మిత్రపక్షం అన్నాడీఎంకేతో అన్నామలైకి సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అన్నాదురై, జయలలితలపై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే అందుకు కారణం. అన్నాడీఎంకే ఒత్తిడితోనే అన్నామలైను అధ్యక్ష పదవి నుంచి బీజేపీ తప్పించిందని గతంలో వార్తలు వచ్చాయి.

### కనిపించని బీజేపీ జెండా!

కొంతకాలం తమిళనాడులో బీజేపీని బలోపేతం చేసే బాధ్యతను అన్నామలై భుజానికెత్తుకున్నారు. గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఆ పార్టీకి అన్నామలై అతిపెద్ద దిక్కుగా కనిపించారు. దీంతో ఆయన పేరు నేషనల్ వైడ్‌గా మార్మోగిపోయింది. అయితే ఇప్పుడు అదే పార్టీని వీడనున్నారని వస్తున్న వార్తలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దీనికి తోడు తాజాగా ఎయిర్‌పోర్టుకు అన్నామలై వచ్చిన కారులో బీజేపీకి సంబంధించిన జెండా లేకపోవడం పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తుంది!

## దేశంలో జల వనరుల నిర్వహణ కోసం

# ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలో నీటి వనరుల నిర్వహణ కోసం శాటిలైట్ టెక్నాలజీ, అంతరిక్ష ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేసేందుకు ఈ అగ్రిమెంట్ చేసుకుంది. దిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సందర్భంగా ఈ అవగాహన ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయి. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం జలాశయాల పర్యవేక్షణ, నీటి విస్తరణ అంచనా, నదీ ప్రవాహ విశ్లేషణ, ఉపగ్రహ ఆధారిత నీటి నాణ్యత అంచనాతో సహా 24 కీలక పరిశోధనా రంగాలలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఇస్రో సంయుక్తంగా పనిచేస్తాయి.

### వికసిత్ భారత్ సాధించడానికి నీటి భద్రత చాలా కీలకం : సీఆర్ పాటిల్

డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగిన వర్క్‌షాప్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ పాల్గొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి నీటి భద్రత చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. నీటికి సంబంధించిన సవాళ్లను సాంకేతికత, ఆవిష్కరణలు, సంప్రదాయ జ్ఞానం, ప్రజా భాగస్వామ్యం ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. గత దశాబ్దంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అనేక పరిశోధనా అధ్యయనాలకు మద్దతు ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇందులో 113 ప్రత్యక్ష ప్రాయోజిత ప్రాజెక్టులు కూడా ఉన్నాయని వెల్లడించారు. ఇవి జల రంగంలో ఆచరణాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో సహాయపడ్డాయని తెలిపారు.


### పలు కార్యక్రమాలు ప్రారంభం

ఈ వర్క్‌షాప్‌లో జల్ సంచయ్ జన భాగీదారీ (జీజేబీ) ప్రచార కార్యక్రమం మూడో దశను సీఆర్ పాటిల్ ప్రారంభించారు. 2026 జూన్-2027 మే మధ్య రెండు కోట్ల నీటి సంరక్షణ నిర్మాణాలను సృష్టించాలనే లక్ష్యాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. గత దశలో 1.5 కోట్ల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖ, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్త చొరవతో మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్ వాటర్ ప్రోగ్రామ్‌ను కూడా సీఆర్ పాటిల్ ప్రారంభించారు. అలాగే భారత్ వాటర్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ వేదిక కింద స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు కోసం ఓపెన్ కాల్‌ను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

### ఇస్రో ఛైర్మన్ ఏమన్నారంటే?

ఈ ఒప్పందం రెండు సంస్థల మధ్య సహకారాన్ని మరింత పెంపొందిస్తుందని, నీటి నిర్వహణ కోసం ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేస్తుందని ఇస్రో ఛైర్మన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి వి. నారాయణన్ అభిప్రాయపడ్డారు. జలవనరులను పరిశీలించడానికి, ముందస్తుగా అంచనా వేయడానికి, నిర్వహించడానికి నేటి అంతరిక్ష సాంకేతికత అపూర్వమైన సామర్థ్యాన్ని అందిస్తోందని తెలిపారు. భూగర్భ జలాల అంచనా, జలవనరుల పర్యవేక్షణ, వరదల ముందస్తు అంచనా వంటి రంగాలలో పనులకు ఈ భాగస్వామ్యం మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అలాగే ఇస్రో, జలవనరుల రంగం మధ్య సహకారం 1982 నాటిదని గుర్తు చేసుకున్నారు. మరోవైపు, మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్- వాటర్ కార్యక్రమం విద్యాసంస్థలు, ప్రయోగశాలలు, స్టార్టప్‌లు, పారిశ్రామిక భాగస్వాములతో కూడిన బహుళ సంస్థాగత ప్రాజెక్టులకు మద్దతు ఇస్తుందని ఏఎన్ఆర్ఎఫ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శివకుమార్ కళ్యాణ రామన్ అన్నారు. దిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సోమవారం (జూన్ 1న) జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో సుస్థిర భూగర్భ జలాల నిర్వహణ, సాంకేతిక ఆవిష్కరణలు, వర్షపు నీటి సేకరణపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, నిపుణులు పాల్గొని పలు విషయాలు చర్చించారు. దేశంలో నీటి ఆవిష్కరణల భవిష్యత్తుపై చర్చించడానికి నిపుణులు, పరిశోధకులకు ఈ వర్క్‌షాప్ ఒక వేదికగా మారింది.

## దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు..



దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఖాళీ అవుతున్న 27 రాజ్యసభ స్థానాలు, మూడు రాష్ట్రాల్లోని శాసనమండలి స్థానాల భర్తీకి ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఈ మేరకు అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో సోమవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది.
ˇన్ల పరిశీలన జరుగుతుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి జూన్ 11 వరకు గడువు ఉంటుంది. జూన్ 18న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మిజోరాం రాష్ట్రాల్లో మొత్తం 24 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో ఒక్కో రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఇక శాసనమండలి ఎన్నికల విషయానికొస్తే, బీహార్‌లో 9, కర్ణాటకలో 7 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. అలాగే బీహార్‌లో నితీశ్ కుమార్ రాజీనామాతో ఖాళీ అయిన ఒక ఎమ్మెల్సీ స్థానానికి కూడా ఉప ఎన్నిక జరగనుంది.

## జమ్ముకశ్మీర్‌లో తగ్గిన ఉగ్రవాదం!

జమ్మూకశ్మీర్?లో మూడు దశాబ్దాల కంటే ముందు ప్రారంభమైన ఉగ్రవాదం నేటికీ రావణకాష్టంలా మండుతూనే ఉంది. భారత పౌరులు ఉగ్ర దాడులతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కానీ నేడు ఆ పరిస్థితి క్రమంగా మారుతోంది. జమ్మూకశ్మీర్?లో ఉగ్రవాదం మొదలైనప్పటి నుంచి నేటి వరకు చూసుకుంటే, మొదటిసారిగా ఈ మే నెలలో ఉగ్రవాద సంబంధిత మరణాలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. అధికారిక గణాంకాల ప్రకారం, 2026 మొదటి 5 నెలల్లో కేవలం 12 ఉగ్రవాద సంబంధిత మరణాలు మాత్రమే నమోదు అయ్యాయి. ఈ మృతుల్లో 9 మంది ఉగ్రవాదులు కాగా, మన భద్రతా దళ సిబ్బందికి చెందిన ఒకరు, గుర్తింపు వివాదం ఉన్న ఒక స్థానికుడు, గుర్తు తెలియని వ్యక్తి ఉన్నారు. కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు ఉగ్రదాడుల్లో సాధారణ పౌరులు ఎవరూ మరణించలేదు. జమ్మూకశ్మీర్? పోలీస్ డేటా ప్రకారం, 2000 మే నెలలో అక్కడ 288 ఉగ్రవాద సంబంధిత మరణాలు నమోదు అయ్యాయి. 2001 మే నాటికి ఈ సంఖ్య 300కు చేరింది. వాస్తవానికి ఆ సమయంలో కశ్మీర్? లోయ అంతటా, జమ్మూలోని కొన్ని ప్రాంతాల్లో ఉగ్రవాదులు, పౌరులు, భద్రతా సిబ్బంది పెద్ద సంఖ్యలో మరణించారు. దాదాపు ప్రతిరోజూ అక్కడ ఈ ఉగ్రవాద సంబంధిత మరణాలు సంభవించాయి. అయితే కాలక్రమేణా అక్కడ ఉగ్ర హింస క్రమంగా తగ్గుతూ వస్తున్నప్పటికీ, మే నెల మాత్రం అత్యంత హింసాత్మక మాసంగా ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ విధంగా జమ్మూకశ్మీర్?లో ఉగ్రవాద సంబంధిత మరణాలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. అయితే ఆ తర్వాతి కాలంలో ఉగ్రవాదుల వ్యూహాలు మారాయి. స్థానికుల్లో కొందరు కొత్తగా ఉగ్రవాద గ్రూపుల్లో చేరడం వల్ల టెర్రర్ డెత్స్?లో హెచ్చుతగ్గులు కనిపించాయి. అవి ఎలా ఉన్నాయంటే?

మళ్లీ పెరిగిన ఉగ్రవాదం

2016 నాటి అశాంతి తర్వాత జమ్మూకశ్మీర్?లో హింస మళ్లీ పెరిగింది. ఆ ఏడాది మే నెలలో టెర్రర్ డెత్స్? 27 వరకు నమోదుకాగా, 2017, 2018, 2019 మే నెలల్లో వరుసగా 37 చొప్పున ఉగ్రవాద సంబంధిత మరణాలు సంభవించాయి. కానీ ఆ తర్వాత కాలంలో ఉగ్రవాదం క్రమంగా తగ్గింది.

జీరోకు పడిపోయిన మరణాలు

అయితే ఈ ఏడాది (2026) మే నెలలో ఈ ఉగ్రవాద సంబంధిత మరణాలు సున్నాకు పడిపోయాయి. నిరంతర ఉగ్రవాద నిరోధక చర్యలు, నిఘా వర్గాల మధ్య మంచి సమన్వయం, స్థానిక యువత ఉగ్రవాద గ్రూపుల్లో చేరడం బాగా తగ్గిపోవడమే ఇందుకు కారణమని భద్రతాధికారులు చెబుతున్నారు. పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక సీనియర్ పోలీస్ అధికారి కీలక విషయాలు వెల్లడించారు. "జమ్మూకశ్మీర్?లో ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇచ్చే వ్యవస్థలు బాగా బలహీనపడ్డాయి. అలాగే కొత్తగా ఉగ్రవాదంలోకి చేరేవారి సంఖ్య చరిత్రలోనే అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. భద్రతా సంస్థలు సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నాయి" అని పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడేందుకు అధికారిక అనుమతి లేని ఒక సీనియర్ ఆర్మీ అధికారి మాట్లాడుతూ, రెండు దశాబ్దాల క్రితం నాటి పరిస్థితులతో పోలిస్తే, నేడు జమ్మూకశ్మీర్?లో భద్రతా వాతావరణం పూర్తిగా మారిపోయిందని చెప్పారు. "ఉగ్రవాదానికి ఊతమిచ్చే వ్యవస్థ మొత్తం ఇప్పుడు బాగా కుచించుకుపోయింది. సరిహద్దుల గుండా చొరబాట్లు ఇప్పుడు మరింత కష్టతరంగా మారాయి. ఉగ్రవాద శక్తులు క్షేత్రస్థాయిలో మళ్లీ పుంజుకోకుండా భద్రతాదళాలు సమర్థవంతంగా నిరోధించగలుగుతున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

### జమ్మూకశ్మీర్?లో వార్షిక మరణాలు

జమ్మూకశ్మీర్? వార్షిక మరణాల గణాంకాలు పరిశీలిస్తే, ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తుంది. 2000లో 2799 ఉగ్రవాద సంబంధిత మరణాలు నమోదయ్యాయి. 2021లో అత్యధికంగా 4,011 మరణాలు సంభవించాయి. అందులో 1000 మందికి పైగా పౌరులు, 628 భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, 2,345 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. వాస్తవానికి ఉగ్రవాదం మొదలైన ప్రారంభ సంవత్సరాల్లో వార్షిక మరణాల సంఖ్య 3000కు పైగానే ఉండేది. కానీ ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ వచ్చింది.

## నీట్- యూజీ రీ ఎగ్జామ్‌పై సుప్రీం కీలక ఉత్తర్వులు- ాపీ= మోడ్?లోనే పరీక్ష

2026 నీట్- యూజీ పరీక్ష నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 21న జరగనున్న నీట్ పునఃపరీక్షను 'కంప్యూటర్ ఆధారిత పరీక్ష' (సీబీటీ) విధానంలో నిర్వహించాలని ఆర్?జేడీ ఎంపీ సుధాకర్‌సింగ్ దాఖలు చేసిన పిటిషన్?ను స్వీకరించడానికి నిరాకరించింది. ప్రస్తుతం ఉన్న పెన్? అండ్ పేపర్? విధానంలోనే నీట్ పునఃపరీక్ష నిర్వహించాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అకస్మాత్తుగా పరీక్షా విధానాన్ని మార్చడం ఆచరణాత్మకంగా కష్టమని ధర్మాసనం అభిప్రాయపడింది. సమయాభావం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్?టీఏ)పై ఉన్న ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. తర్వాత ఎంపీ సుధాకర్ సింగ్? సహా, ఇతరులు దాఖలు చేసిన పలు పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు జూలై 27కు వాయిదా వేసింది.

### జూన్? 21న రీటెస్ట్

మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3న నీట్?-యూజీ పరీక్ష నిర్వహించారు. అయితే ఆ తర్వాత ఆ పేపర్ లీక్ అయినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనితో మే 12న ఎన్?టీఏ నీట్? పరీక్షను రద్దు చేసింది. విద్యార్థులు, ప్రతిపక్షాల ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం ఈ పేపర్ లీక్ కేసును సీబీఐకు అప్పగించింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు విద్యార్థుల భవిష్యత్?ను దృష్టిలో ఉంచుకొని ఈ పరీక్షను తిరిగి (రీటెస్ట్?) జూన్? 21న నిర్వహించేందుకు ఎన్?టీఏ సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ఎలాంటి లీకేజీలకు తావు లేకుండా పరీక్షను సీబీటీ విధానంలో జరపాలని కోరుతూ ఆర్?జేడీ ఎంపీ సుధాకర్? సింగ్?తో పాటు మరికొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.







# కబ్జా కోరుల పై కేసులు పెట్టేయ్..

# కాసులు కొట్టేయ్

- కోర్టుకు చేరని కేసులెన్నో.
- ఆగని రియల్ దందా.
- రెవెన్యూకు రక్షణ కరవు.




**పరవాడ, పెన్ సత్తా, మే 31:** భూ కబ్జాలకు పాల్పడుతున్నవారిని అదుపు చేసేందుకు ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ నీరుగారి పోతుంది. రెవెన్యూ అధికారులు కేసులు పెట్టి చేతులు దులుపు కోవడంతో కబ్జా కోరులు రెచ్చిపోతున్నారు. రియల్ ఎస్టేట్ ప్లాట్ల కోసం ఏకంగా ప్రభుత్వ గెడ్డలను కబ్జా చేస్తున్నారు. కబ్జాలకు పాల్పడుతున్నవారు చట్టం తెలియని వారు, పేదలు కానే కాదు. ప్రభుత్వ భూములతో కబాడీ అడుకునే బడా నాయకులుగా ఎదిగిపోయిన చోటా నాయకులు. అంతకు మించి రెవెన్యూ అధికారులను అదిరించి, బెదిరించిన కేసులతో పాటు ల్యాండ్ గ్రాబింగ్ కేసుల్లో నిందుతులు. వీరిని అదుపు చేసేందుకు రెవెన్యూ తీసుకుంటున్న చర్యలకు పోలీసు రక్షణ కరవవుతుంది. ల్యాండ్ గ్రాబింగ్ కేసుల్లో నిందుతులకు అరెస్టల నుంచి రక్షణ కల్పిస్తూ అటు చార్జ్‌షీట్ ఇటు ఫైనల్ రిపోర్ట్ తేల్చకుండానే ఏళ్ల తరబడి కేసులను నీరు గార్చుతున్నారు. పోలీసు యంత్రాంగం ఎఫ్ఐఆర్ నమోదు చేసి తదనంతరం కనీసం చర్యలు తీసుకోవడం లేదు. పిజిఅర్ఎస్‌లో కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. రెవెన్యూ అధికారులు భయంతో కేసులు పెట్టి మిన్నకుంటే, పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి నిందుతులకు ఒత్తాసు పలుకుతున్నారన్న తీవ్ర ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. దీంతో ఏళ్ల తరబడి కేసులు పోలీసు స్టేషన్ లోనే మూలుగుతున్నాయి. చార్జ్‌షీటు, ఫైనల్ రిపోర్ట్‌లుగా కోర్టు పరిధి లోకి పోకుండానే ఏళ్ల తరబడి పోలీసుస్టేషన్‌లో మూలనపడి మూలుగుతున్నాయి. చార్జ్‌షీటు దాఖలు చేసేందుకు కనీస గడువును భారతీయ నాగరిక సురక్షా సన్నిహిత(బిఎన్ఎస్ఎస్), సెక్షన్ 193లో నిర్దేశించక పోవడాన్ని పోలీసులు సాకుగా తీసుకుని నిందుతులకు అండగా నిలుస్తున్నారు. చార్జ్‌షీటు, ఫైనల్ రిపోర్ట్ దాఖలు చేయడంలో పోలీసు అధికారులు అనవసర జాప్యాన్ని నివారించాలన్న సూచనను లెక్క చేయడం లేదు. దీంతో కబ్జాదారులకు కనీసం భయం లేకుండా పోతుంది. కేసులు పెడ్తే కాసులతో మేనేజ్ చేసేస్తాం అన్నధీమాతో రెచ్చిపోతున్నారు. కబ్జాలతో కబాడీ అడుతున్న అప్పారావులకు పోలీసు యంత్రాంగాలు ఎంతగా సహకరిస్తున్నారో అర్థం చేసుకునేందుకు పరవాడ మండలం పెదముషిడివాడలో నమోదు అయిన ల్యాండ్ గ్రాబింగ్ కేసుల పరిస్థితి చూస్తే పోలీసు అధికారుల చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అయిపోతుంది. ఎపి పోలీస్ మాన్యువల్, బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 193 లో పేర్కొన్న కేసుల విషయంలో సయితం చార్జ్‌సీటు, ఫైనల్ రిపోర్ట్‌లు మూలుగుతున్నాయి. బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 193 సబ్‌సెక్షన్ 2 లో మహిళల పై అత్యాచారాలు, ఫోక్సో కేసులో కేవలం రెండు నెలల్లో ఇన్వెస్టగేషన్ పూర్తి చేసి చార్జ్‌షీట్ కోర్టుల ముందుంచాలన్న నిబంధనను సయితం పరవాడ పోలీసులు పట్టించుకోవడం లేదు. పి.బోనంగికి చెందిన ఒక విద్యాసంస్త నిర్వాహకుని పై ఫోక్సో చట్టం 2012 కింద ఫిర్యాదు అందింది. అయితే ఇప్పటి అర్ధసంవత్సరం దాటినా చార్జ్‌షీట్, ఫైనల్ రిపోర్ట్‌ను కోర్టులో దాఖలు చేయలేదన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఈ వ్యవహారం పరవాడ పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్ కేసుల సమీక్షల స్థితిగతలకు ఇది అద్దం పడ్తుంది. పరవాడ మండలంలో అత్యధిక ప్రభుత్వ భూమి కలిగిన రెవెన్యూ గ్రామం పెదముషిడివాడ. పెదముషిడివాడ లోనే కొండపోరంబోకు వందల ఎకరాలు ఉంది. ఇక్కడ రౌడీయిజం ముసుగులో భూ కబ్జాలతో కబాడీ ఆట ప్రారంభించిన కిరాయి మూకలు ఇప్పుడు కోట్లకు పడగలెత్తాయి. వీరి కబ్జా పనితనానికి మెచ్చిన రెవెన్యూ అధికారులు ఏకరాలకు ఏకరాల భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నారు. గత పంచాయతీ ఎన్నికలకు పూర్వం కేవలం సెంట్లలో భూమి కల్గిన వారికి ఇన్ని ఎకరాల భూమి ఎలా వచ్చిందో విజిలెన్స్, ఎసిబి అధికారులు నిగ్గుతెల్చాలి. పరుల భూములు కబ్జా చేస్తున్నవారిని రెవెన్యూ అధికారులు ఎందుకు భుజాన మోస్తున్నారో దర్యాప్తు అధికారులే నిగ్గు తేల్చాలి. పెదముషిడివాడలో ల్యాండ్ పూలింగ్ భూ భాగోతంలో పోలీసు అధికారుల బినామీలకు కట్టబెట్టిన ప్లాట్ల వివరాలు ఈశ్వరునికే ఎరుక. ఇక పెదముషిడివాడలో ల్యాండ్ గ్రాబింగ్ కేసుల వివరాలు పరిశీలిస్తే 2024 వ సంవత్సరం ఆగస్టు నెల 29 వ తేదీన అప్పటి పరవాడ ఇన్‌చార్జ్ తహశీల్దార్ డి శాంతి భూషన్ రావు పరవాడ పోలీస్ స్టేషన్‌హౌస్ ఆఫీసర్ సంపత్ రావు, బాలసూర్యారావుకు ఒక మహిళతో సహ 5 గురు వ్యక్తులు పెదముషిడివాడలో పలు సర్వేనెంబర్లలో ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నారని ఆరోపిస్తు లిఖితపూర్వక ఫిర్యాదు(రిపోర్ట్)చేశారు. ఈ రిపోర్ట్‌ను స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ బాలసూర్యా రావు ఆగస్టు 29 వ తేదీ, 20024 వ సంవత్సరంలో ఎఫ్ఐఆర్ నెం.339/2024తో ఐపిసి సెక్షన్ 447రెడ్‌విత్ 34తో పాటు ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్-1982 సెక్షన్ 3,4 ప్రకారం కేసు నమోదు చేశారు. అనంతరం ఆయన బదిలీ కావడంతో ఆర్ మల్లిఖార్జునరావు పరవాడ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఈ కేసు నీరుగారి పోయింది. పెదముషిడివాడ గ్రామానికి చెందిన బర్ల శంకర్ ఈ విషయాన్ని అనకాపల్లి ఎస్పికి ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు దారునికి పంపిన ఎండార్స్‌మెంట్‌లో రెవెన్యూ అధికారులు సహకరించలేదని చెప్పడం పరవాడ పోలీసుల అతి తెలివికి నిదర్శనంగా నిలుస్తుంది. ఎపి ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్, 1982 సెక్షన్ 10 బర్డన్ ప్రూఫ్ గురించి చెబుతుంది. ఈ సెక్షన్ ప్రకారం గ్రాబింగ్ అరోపణలు ఎదుర్కొంటున్న నిందుతులు తాము ల్యాండ్ గ్రాబింగ్‌కు పాల్పడలేదని నిరూపించుకోవల్సి ఉంటుంది. అలాగే గుడ్ ఫెయిత్ తో అధికారులు కేసులు నమోదు చేస్తే వారికి చట్టపర మైన రక్షణ ఉంటుందని చెబుతుంది. గెజిటెడ్ అధికారి హోదాలో తహశీల్దార్ ప్రభుత్వం భూమిని ఆక్రమించారని ఐదుగురి పై కేసు నమోదు చేస్తూ వారి వద్ద ఎటువంటి లాఫుల్ డాక్యుమెంట్, పట్టాలేవని స్పష్టంగా పేర్కొంటూ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు రెవెన్యూ స్టాఫ్, ఫిర్యాదు దారుల వివరాలను సయితం తెలిపారు. వీరి నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసి లిస్టెడ్ విట్‌నెస్‌లుగా పేర్కొని పోలీసు అధికారులు చార్జ్‌షీటులు దాఖలు చేయవచ్చు. ప్రభుత్వ గెజిటెడ్ అధికారి హోదాలో తహశీల్దార్ డి శాంతి భూషన్ రావు ఇచ్చిన రిపోర్ట్(ఫిర్యాదు)కు విచారణ యోగ్యత లేకున్నా, సివిల్ వివాదం అయినా ఫైనల్ రిపోర్ట్‌ను మేజిస్ట్రేట్‌కు సమర్పించవచ్చు. న్యాయస్థానాల్లో తదుపరి చర్యల కోసం పోలీసులు వేచివుండవచ్చు. అంతే కాని ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందుతుల్ని ఆరెస్టలు చేయకుండా స్వేచ్ఛగా విడిచిపెట్టడం పరవాడ పోలీసులకే చెల్లుతుంది. దీంతో పెదముషిడివాడలో భూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. రెవెన్యూ అదికారుల పై దాడులకు తెగబడ్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధులు నిర్వాహణకు అడ్డుతగులుతున్నారు. పెదముషిడివాడలో కబ్జాలతో కోట్లకు పడగలెత్తినవారు రెవెన్యూ అధికారుల పై దాడులకు తెగబడ్తున్నారు. ఈ విషయాన్ని పరవాడ తహశీల్దార్ పరవాడ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో స్పష్టం చేశారు. పరవాడ తహశీల్దార్ కార్యాలయం ఆర్‌సినెం.38/2026/జిఎ/తేది 17.02.2026తో తహశీల్దార్ ఎంఎస్ అరుణ్ కుమార్ ఈ ఏడాది ఫిబ్రవరి 17 వ తేదీన స్టేషన్ హౌస్ ఆఫీసర్, పరవాడ పోలీస్‌స్టేషన్‌కు రిపోర్ట్(పిర్యాదు)చేశారు. తమ కార్యాలయం రెవెన్యూ సిబ్బంది పలు మార్లు హెచ్చరికలు చేసినప్పటకీ పెదముషిడివాడకు చెందిన 7 గురు వ్యక్తులు సర్వే నెంబర్ 367,378,406 సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమిని ఎటువంటి వేలీడ్ డాక్యుమెంట్, పట్టాలేకుండా ప్రభుత్వ భూమి దురాక్రమణకు పాల్పడుతున్నారని, వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన రెవెన్యూ అధికారుల విధులను అడ్డుకున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ముగ్గురు వ్యక్తుల పేర్లతో చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. అయితే నేటికీ ఆ ఫిర్యాదు పై పరవాడ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కల్గించడం నాన్‌బెయిల్‌బుల్ అఫెన్స్. అయినా పరవాడ పోలీసులు కనీస చర్యలు తీసుకోకవడంతో పెదముషిడివాడలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. పెదముషిడివాడ లోకి రెవెన్యూ అధికారులు వెళ్లాలంటేనే హడలి పోతున్నారు. పెదముసిడివాడలో ఫార్మాసిటీ తాడి గ్రామ నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్దం చేస్తుంది. ఈ నేపధ్యంలో పునరావాసానికి ఉద్దేశించిన ప్రభుత్వ భూములు సయితం కబ్జాకోరల్లో చిక్కుకు పోతున్నాయి. అలాగే గత ప్రభుత్వం హయాంలో ల్యాండ్ పూలింగ్ లబ్దిదారుల జాబితాలో కబ్జాకోరులు చేరిపోయారని ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇప్పటి కైనా పోలీసు అదికారులు కబ్జాకోరుల పై చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

# విశాఖలో ఎయిర్ ట్రంక్ క్యాంపస్ ఏర్పాటు చేయండి

**ఎయిర్ ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో మంత్రి నారా లోకేష్ భేటీ.**

**ముంబయి, జూన్ 01:** ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో డేటా సెంటర్లను నిర్వహిస్తున్న ప్రఖ్యాత హైపర్ స్కేల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముంబాయిలో సమావేశమయ్యారు. ఆసియా పసిఫిక్, మిడిల్ ఈస్ట్, ఆస్ట్రేలియా, జపాన్, మలేషియా, హాంకాంగ్, సింగపూర్ లలో ఎయిర్ ట్రంక్ భారీ డేటా సెంటర్లను నిర్మించి నిర్వహిస్తోంది. ఈ భేటీలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ...ఏఐ, డేటా హైపర్ స్కేల్ హబ్‌గా వైజాగ్ ఆవిర్భవిస్తోంది. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్, అదానీకనెక్స్ ఇతర ప్రధాన ప్రాజెక్టులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటుకు అన్నివిధాలా అనుకూలతలు కలిగిన విశాఖపట్నం డేటా సెంటర్ హబ్ గా వేగంగా అభివృద్ధి చెందుతోంది. విశాఖ నగరంలో 6 గిగావాట్ల డేటా సెంటర్లను ఏర్పాటు చేయాలన్నది మా లక్ష్యం. మల్టీ-గిగావాట్ ఏఐ మౌలిక సదుపాయాలు, సంపూర్ణ ఎకోసిస్టమ్ అభివృద్ధి పై మేం దృష్టిసారించాం అన్నారు. ఎయిర్ ట్రంక్ ఫ్యూచర్ క్యాంపస్ ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో మరే ఇతర ప్రాంతాల్లో లేని కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు మావద్ద అందుబాటులో ఉన్నాయి. డేటా సెంటర్లకు అవసర మైన విద్యుత్ కోసం రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు కూడా సిద్ధమవుతున్నాయి. ఏపీలో ఎయిర్ ట్రంక్ పెట్టుబడులు పెట్టాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు. ఎయిర్ ట్రంక్ తో సంబంధాలను పునరుద్ధరణ, భారతదేశంలో తదుపరి దశ విస్తరణ, ఏఐ - హైపర్‌స్కేల్ మౌలిక సదుపాయాలు, ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా నిలిపే అంశం పై మంత్రి లోకేష్ చర్చించారు. రాబిన్ ఖుదా స్పందిస్తూ...ఎయిర్ ట్రంక్ ఇండియా ప్రణాళికలు, మినా క్లౌడ్‌ఇన్‌ఫ్రాను స్వాధీనం చేసుకున్న తర్వాత దాని ఏకీకరణ, భారతదేశంలో ప్రణాళికాబద్ధ మైన పెట్టుబడులు, విస్తరణ రోడ్ మ్యాప్, కీలక కస్టమర్ సేవలు, హైపర్‌స్కేలర్ అవసరాల పై చర్చించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. భారతదేశంలో అగ్రగామి ఏఐ, హైపర్ స్కేల్ డేటా



సెంటర్ హబ్ గా అవతరించాలన్న ఆంధ్రప్రదేశ్ దార్శనికత పై గత ఏడాది అక్టోబర్ లో మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా తొలిసారి రాబిన్ ఖుదాతో అక్కడ సమావేశమయ్యారు. ఆ తర్వాత భారతదేశంలో విస్తరణ గురించి ఎయిర్ ట్రంక్ బృందం ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారులతో పలుమార్లు చర్చలు జరిపింది. భారతదేశంలో ఒక ప్లాట్ ఫాం ఏర్పాటు చేశాక విస్తరణ పై నిర్ణయం తీసుకుంటామని ఎయిర్ ట్రంక్ బృందం తెలిపింది. ఏప్రిల్ 2026 లో ఎయిర్ ట్రంక్ అధికారికంగా భారతదేశం లోకి ప్రవేశించింది. ముంబయి, చెన్నై, హైదరాబాద్‌లలో ప్రాజెక్టులు కలిగి, సుమారు 600 మెగావాట్ల సామర్థ్యంతో ప్రణాళికాబద్ధ మైన పైప్‌లైన్‌తోపాటు, బ్లాక్‌స్టోన్ మద్దతు గల డేటా సెంటర్ ప్లాట్‌ఫామ్ లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రాను ఎయిర్ ట్రంక్ టేకోవర్ చేసింది. ఈ స్వాధీనం ఎయిర్ ట్రంక్‌కు తక్షణ కార్యకలాపాల స్థావరాన్ని అందిస్తుంది. ఎయిర్ ట్రంక్ ఆసియా పసిఫిక్ వ్యూహంలో భాగంగా భారతదేశాన్ని ఒక ప్రధాన వృద్ధి మార్కెట్‌గా ఆ సంస్థ గుర్తించింది. ఎయిర్ ట్రంక్ తో సంబంధాలను పునరుద్ధరణ, భారతదేశంలో తదుపరి దశ విస్తరణ, ఏఐ హైపర్‌స్కేల్ మౌలిక సదుపాయాలు, ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా నిలిపే అంశం పై మంత్రి లోకేష్... రాబిన్ ఖుదాతో చర్చించారు. ఎయిర్ ట్రంక్ ఆసియా పసిఫిక్ వ్యూహంలో భాగంగా భారతదేశాన్ని ఒక ప్రధాన వృద్ధి మార్కెట్‌గా ఆ సంస్థ గుర్తించింది.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ.

- అవ్వాతాతలు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్లు అందజేసిన యార్లగడ్డ
- నియోజకవర్గంలో 40,521 మంది లబ్దిదారులకు రూ.17.35 కోట్ల పెన్షన్ల పంపిణీ.
- చిక్కవరం ఘటన పై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.
- చిన్నారుల మృతికి కారణ మైన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్.
- యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలే ప్రధాన లక్ష్యం యార్లగడ్డ.





**గన్నవరం, పెన్ సత్తా, జూన్ 01:** నియోజకవర్గ అభివృద్ధిని అజెండాగా పెట్టుకుని ముందుకు సాగుతున్నానని, అలానే ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నానని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. సోమవారం ఉంగుటూరు మండలం ఉంగుటూరు గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో అధికారులు స్థానిక నాయకులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామం లోని అవ్వాతాతలు, దివ్యాంగుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్ నగదును అందజేసి వారి ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 40,521 మంది లబ్ధిదారులకు రూ.17.35 కోట్ల పెన్షన్ మొత్తాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిక్కవరం గ్రామంలో అక్రమంగా తవ్విన చెరువులో పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటన పై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. చెరువును అక్రమంగా తవ్వి చిన్నారుల మృతికి కారణ మైన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే విషయ మై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కామన్ సైట్స్ పై, అక్రమాణల పై ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటివరకు పని ప్రారంభించలేదని ఘాటుగా స్పందించారు. ఈ అంశాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని చెప్పారు. రామవరప్పాడులో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.29 లక్షలతో నిర్మించిన రహదారిని త్వరలో ప్రారంభిస్తామని, దీని ద్వారా సుమారు 23 వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అలాగే గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. బాపులపాడు మండలంలో 60 ఎకరాలు, గన్నవరం మండలంలో 39 ఎకరాల ప్రభుత్వ భూములను అధికారులు అన్యాక్రాంతం నుంచి రికవరీ చేసినట్లు తెలిపారు. బుడమేరు ప్రక్షాళనలో భాగంగా స్ట్రెయిటెనింగ్ చేపట్టడం ద్వారా విజయవాడ నగరానికి ఆనుకుని ఉన్న 150 ఎకరాల భూమి ప్రభుత్వానికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గన్నవరంలో రూ.200 కోట్ల పెట్టుబడితో సి-డాక్ (సి- డిఏసి) కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని, దీనివల్ల ఐటీ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్ తో చర్చించనున్నట్లు చెప్పారు. త్వరలో గన్నవరంలో పి-4 కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీనికి అవసరమైన కంప్యూటర్లు, ఫర్నిచర్ ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. హెచ్‌సీఎల్ సంస్థ తన సిఎస్ఆర్ నిధుల నుంచి ప్రతి నెలా రూ.6 లక్షలు కేటాయిస్తున్నందుకు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉంగుటూరు గ్రామంలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును జల్ జీవన్ మిషన్ పథకం కింద పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉంగుటూరు మండలం లోని రోడ్డు పనులను కూడా ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని తెలిపారు. అవసరమైతే సిఎస్ఆర్ నిధులను వినియోగించి అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. గన్నవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, ఉంగుటూరు గ్రామ టిడిపి అధ్యక్షులు మారడా పాపారావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి మూల్పురి సాయి కళ్యాణి, ఏ.యం.సి వైస్ చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు, అరుమళ్ళ కృష్ణారెడ్డి, గొడ్డళ్ల చిన్న రామారావు, గోళ్ళ రంగారావు, ఈడ్పుగంటి కృష్ణమూర్తి, అరికట్ల రవి, రాజబోయిన శివాజీ, అమర్తల సోమేశ్వరరావు, వంగా అయ్యప్పరెడ్డి, మేడేపల్లి రమ, తుమ్మల లత, యర్రగుంట్ల వినోద్, మునిపల్లి నాగరాజు, చింత చంద్రశేఖర్, మల్లాల రంగారావు, ఉయ్యూరు మురళి, తేలు సత్యనారాయణ, పోతినేని రామకృష్ణ, శ్రీను, కొండా రాంబాబు, నక్కా వెంకటేశ్వరరావు, నాగేంద్ర, చల్లగాలి సునీల్, పొట్లూరి భువనేశ్వరి, గరిమెళ్ళ వరప్రసాద్, పోతినేని బాపయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

**ఎంపీ హరీష్ మాధుర్ తో కలిసి పింఛన్లు పంపిణి చేసిన ఎమ్మెల్యే బండారు.**





**అమలాపురం, పెన్ సత్తా, జూన్ 01:**
ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావులు పేర్కొన్నారు. సోమవారం ఆలమూరు మండలం గుమ్మిలేరులో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారిరువురు కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ప్రజలకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనన్నారు. కొత్తపేట నియోజకవర్గం లోనే 41,656 మందికి సామాజిక, ఆర్థిక భద్రత కోసం పింఛన్లు అందిస్తున్నామని ఆయన అన్నారు. మొత్తం నియోజకవర్గానికి సంబంధించి రూ.18.30 కోట్ల రూపాయలు (18,30,88000) పంపిణీ జరుగుతుందన్నారు. పింఛన్ల పంపిణీతో పేదల జీవితాలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని వ్యాఖ్యానించారు.
జొన్నాడ ఫ్లైఓవర్ కాంట్రాక్టు రద్దు చేయాలని కోరాం. జొన్నాడ ఫ్లైఓవర్ పనులు ఆలస్యం కావడం తీవ్ర బాధాకరమైన విషయమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. పనుల జాప్యం పై అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు మాట్లాడుతూ జొన్నాడ ఫ్లైఓవర్ పనుల గురించి ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణ బాబు, జాతీయ రహదారి ఉన్నతాధికారుల తో మాట్లాడటం జరిగిందన్నారు. జొన్నాడ ఫ్లైఓవర్ కాంట్రాక్ట్ పనులను రద్దుచేసి, కొత్త టెండర్లు పిలిచి పనులు అప్పగించాలని కోరామన్నారు. ఈ ప్రతిపాదనలన్నీ కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు.తక్షణమే సర్వీస్ రోడ్లను మంజూరు చేసి,వెంటనే నిర్మించాల్సిందిగా కోరామన్నారు. త్వరలోనే ఈ పనులన్నీ ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. రావులపాలెంలో ఆక్రమణల తొలగింపు తర్వాత సర్వీస్ రోడ్లు,డ్రైన్లు నిర్మాణం చేయాలని కోరామన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు.

# విశాఖ రైల్వే జోన్ ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష హోంమంత్రి అనిత

**- కార్యకర్తల మనోభావాలకు భంగం కలిగితే చర్యలు తప్పవు.**



**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 10:** విశాఖ రైల్వే జోన్ ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ అని, దాని ఏర్పాటు దిశగా ఎన్డీఏ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖ రైల్వే జోన్ ఆంధ్రుల హక్కు అని పేర్కొన్న హోంమంత్రి, దీనికోసం టీడీపీ ఎంపీలు పార్లమెంట్‌లో నిరంతరం పోరాటం చేశారని తెలిపారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైల్వే జోన్ అంశం పై ఎలాంటి చర్చ జరగలేదని, కేసుల రాజకీయాల పైనే దృష్టి పెట్టారని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పార్లమెంట్ సభ్యుల చొరవతో విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు ప్రక్రియ వేగం పుంజుకుందని ఆమె పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రైల్వే జోన్ కోసం అవసర మైన 50 ఎకరాల భూమిని కూడా కేటాయించ లేదని ఆరోపించారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు సంబరాలు చేసుకోవాల్సిన సందర్భమిదని హోంమంత్రి అన్నారు. రైల్వే జోన్ ద్వారా వచ్చే ఆదాయం రాష్ట్ర అభివృద్ధికి దోహదపడటమే కాకుండా ప్రత్యక్ష, పరోక్ష రంగాల్లో యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో పెద్ద సంఖ్యలో పరిశ్రమలు, పెట్టుబడులు వస్తున్నాయని, ప్రముఖ సంస్థలు కూడా ఈ ప్రాంతం పై ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. గూగుల్ వంటి సంస్థ ఉత్తరాంధ్రలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం సంతోషకరమని చెప్పారు. రాబోయే మూడు, నాలుగు సంవత్సరాల్లో ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు వలస వచ్చే పరిస్థితులు ఏర్పడతాయని, ఉద్యోగ అవకాశాలు కల్పించే కేంద్రంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. పాయకరావుపేట నియోజకవర్గ ప్రజల తరపున ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తల అంశం పై స్పందించిన హోంమంత్రి అనిత, కార్యకర్తలు ఉంటేనే పార్టీ ఉంటుందని, టీడీపీకి కార్యకర్తలే అసలైన అధినేతలని అన్నారు. కార్యకర్తల మాట తమకు శిరోధార్యమని పేర్కొంటూ, సీఐ విషయంలో సోషల్ మీడియాలో కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయనే అంశాన్ని గమనించానని చెప్పారు. దీని పై తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్

**వైసీపీని వీడి టీడీపీలో చేరిన బొంతలపల్లికి చెందిన 35 కుటుంబాలు**

**ఎంపీ పార్థసారథి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సమక్షంలో టీడీపీలోకి చేరిక**





**పుట్టపర్తి, పెన్ సత్తా, జూన్ 10:**
పుట్టపర్తి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. బొంతలపల్లి గ్రామానికి చెందిన 35 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. బొంతలపల్లి సర్పంచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిల చేతుల మీదుగా టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.
ఈ సందర్భంగా ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత పేదలు, రైతులు, మహిళలు, యువతకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నందున ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలన పై ప్రజలు విసిగిపోయారని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం పై విశ్వాసంతో ప్రజలు పెద్దఎత్తున టీడీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు.
స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.
వైసిపి నుంచి టీడీపీ లోకి చేరిన వారిలో గంగాద్రి నాగరాజు రమేష్ రవి చిరంజీవి మనోహర్ చందు భాస్కర్ నరసింహులు పెద్ద గంగుల లక్ష్మయ్య లక్ష్మీనరసమ్మ లక్ష్మమ్మ చిన్న గంగులప్ప లక్ష్మీపతి, లక్ష్మీనరసమ్మ ,నీలమ్మ ఈశ్వరమ్మ, సుశీల వైష్ణవి లక్ష్మీదేవి శారద ,రేణుక గంగులమ్మ ,సాయి ,లలిత ,హరి తులసి, మునెప్ప ,శైలజ, నారాయణమ్మ టీడీపీ కండువా కప్పుకొని టీడీపీ లో చేరారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం లోనే పేదలకు సంక్షేమం దొడ్డి






**మునగపాక, పెన్ సత్తా, జూన్ 01:** మండలం లోని నాగులపల్లి గ్రామంలో శాసనసభ్యుల సుందరపు విజయ్ కుమార్ ఆదేశాలతో మునగపాక మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస రావు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పంపిణీ చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంతో పోలిస్తే కూటమి అధికారం చేపట్టినప్పటి నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆర్థికంగా డెవలప్ చేస్తూ ఎంతో మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు 80% పనులు పూర్తి చేసారన్నారు. అంతే కాకుండా దేశంలో ఉన్న అనేక కంపెనీలు ఆంధ్రప్రదేశ్ తీసుకొచ్చి పెట్టుబడులు పెట్టిస్తూ తద్వారా రాష్ట్రం డెవలప్ చేస్తూ రానున్న రోజుల్లో భారతదేశంలో నెంబర్ వన్ గా ఆంధ్రప్రదేశ్ నిలబెట్టాలని ప్రయత్నం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, విద్యా శాఖ మాత్యులు నారా లోకేష్ కి, స్థానిక శాసనసభ్యులు సుందర విజయ కుమార్ కి, తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వర రావు కి ధన్యవాదాలు తెలియజేస్తున్నా అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గోసాల గోవింద్, పి నాగు, పి రాజు, డొక్కా శివకుమార్, డొక్కా రాజు, నేలపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యత ఎస్పీ

**బాధితులకు 7 రోజుల్లోపు న్యాయం చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం.**

**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 01:**ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, వారికి భరోసా కల్పించడమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బాధితుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేటి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 52 ఫిర్యాదులను స్వీకరించారు. వీటిలో ప్రధాన ఫిర్యాదులు సివిల్ వివాదాలు, భూ తగాదాలు, మోసపూరిత ఘటనలు, ఆస్తి సంబంధిత వివాదాలు వున్నాయి.

?కుటుంబ సమస్యల కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య వేధింపులు,

?ఇతర సమస్యలు వున్నాయి. వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన పౌర సమస్యలను ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణమే చర్యలు చేపట్టాలని ఈ క్రింది ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదు పై 7 రోజుల్లోపు సమగ్ర విచారణ పూర్తి చేసి, బాధితులకు న్యాయం చేయాలని,.నిష్పక్షపాత విచారణతో ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా, కేవలం వాస్తవాల ఆధారంగా చట్టపర మైన చర్యలు తీసుకోవాలి ఎస్పీ ఆదేశించారు.

బాధితులకు తమ ఫిర్యాదు పై చేపట్టిన చర్యల గురించి ఎప్పటి కప్పుడు సమాచారం అందిస్తూ వారిలో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు.

విచారణ అనంతరం తీసుకున్న చర్యలకు సంబంధించిన పూర్తి నివేదికను తప్పనిసరిగా జిల్లా కార్యాలయానికి సమర్పించాలన్నారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శక మైన న్యాయం అందించడమే పోలీసు యంత్రాంగం ప్రధాన బాధ్యత. ముఖ్యంగా మహిళా రక్షణకు పెద్దపీట వేస్తూ, వారిని మోసగించే వారి పై ఉక్కుపాదం మోపుతాం. ప్రజా సమస్యల పరిష్కారంలో అనకాపల్లి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని తుహిన్ సిన్హా తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, జిల్లా పోలీసు, కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేసిన దాడి




**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 01:** కసింకోట మండలం, పరవాడ పాలెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మూడు వేల రూపాయలను పెన్షన్ గా అందించే వారిని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నాలుగు వేల రూపాయలకు పెంచడం జరిగిందని అన్నారు. అంతే కాకుండా వితంతు పెన్షన్, కిడ్నీ బాధితుల పెన్షన్ వంటి పలు రకాల పెన్షన్లను అందించడం జరుగుతున్నదని అన్నారు. ఇవే కాకుండా రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు తల్లికి వందనం, మహిళలకు వచ్చి ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ, మత్స్యకార భరోసా వంటి పది రకాల సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడం జరుగుతున్నదని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన ధ్యేయంగా రాష్ట్రంలో బహుళ జాతి కంపెనీలు భారీ పెట్టుబడులు పెట్టే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటి విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కృషి చేస్తున్నారని అన్నారు. దానికి నిదర్శనంగానే నర్సీపట్నం వద్ద స్టీల్ ప్లాంట్, విశాఖపట్నంలో డేటా సెంటర్, రాయలసీమ జిల్లాలో రాయల్ ఎన్ఫీల్డ్ తయారీ పరిశ్రమ, సోలార్ విద్యుత్ పరికరాల తయారీ పరిశ్రమ వంటి బహుళ జాతి కంపెనీలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే విధంగా చేస్తున్నారని అన్నారు. ఎప్పటి నుండో రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్న విశాఖ రైల్వే జోన్ ఏర్పడి నేటి నుండి తమ కార్యకలాపాలను ప్రారంభించేలా కేంద్ర సహకారంతో చర్యలు తీసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు కృషి ఫలితంగా ఆర్థిక ప్రగతి పుంజుకున్నదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన జరుగుతున్నదని అన్నారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి మంచి చెడులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి అల్పాహారాన్ని భుజించారు. ఈ కార్యక్రమంలో ఉగ్గిన రమణ మూర్తి, గొంతిన లావా అప్పారావు, వేగి దొరబాబు, బలిజ ముసలి నాయుడు, పరవాడ చిన్న రమణ, గొంతిన శ్రీనివాసరావు, గొంతిన గంగాధర్, మడక నాగేశ్వర రావు, దుప్ప రామోజీ, కోనేటి శివ, గొంతిన శ్రీరాములు, గొంతిన ఈశ్వర రావు, సేనాపతి కృష్ణ, కోయిలాడ నాగు, వేగి కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే డిజిటల్ సేవలు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి.





**పుట్టపర్తి, పెన్ సత్తా, జూన్ 10:**ప్రజల ముంగిటకే డిజిటల్ సేవలు అందించే కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రజల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఉడై) ఆధార్ సేవా కేంద్రాన్ని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, మచిలీపట్నం వంటి ప్రధాన నగరాల్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక ఆధార్ సేవలు ఇప్పుడు సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంలో కూడా అందుబాటు లోకి రావడం ఎంతో అభినందనీయం అన్నారు. ప్రజలకు డిజిటల్ సేవలను మరింత చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నేటి కాలంలో బ్యాంకింగ్, విద్య, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు తదితర రంగాల్లో ఆధార్ కార్డు అత్యంత కీలకమైన గుర్తింపు పత్రంగా మారిందని తెలిపారు. ఈ కేంద్రం ప్రారంభంతో స్థానిక ప్రజలు ఆధార్ సేవల కోసం ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని సేవలను తమ ప్రాంతం లోనే పొందగలరని అన్నారు. ఈ కేంద్రంలో కొత్త ఆధార్ నమోదు, మొబైల్ నంబర్ నవీకరణ, చిరునామా మార్పు, బయోమెట్రిక్ అప్‌డేట్‌లు వంటి అన్ని రకాల ఆధార్ సేవలు వేగవంతంగా, పారదర్శకంగా అందించబడతాయని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరికరాలు మరియు ప్రత్యేక శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేకించి వృద్ధులు, మహిళలు, విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పల్లె సింధూర తెలిపారు. డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఈ కేంద్రం మరో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉడై ప్రాజెక్ట్ మేనేజర్ జావీద్, బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థకు చెందిన రీజినల్ మేనేజర్ శ్రీనివాస్ కుమార్, క్లస్టర్ మేనేజర్ హరినాథ్, ఆపరేషన్స్ మేనేజర్ వెంకటేష్ లను ఎమ్మెల్యే పల్లె సింధూర, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు అభినందించారు. ఆధార్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఉడై అధికారులు బీఎల్ఎస్ బృందం చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. ఉడై అధికారులు, బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ సమన్వయంతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందుతాయని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజలందరూ తమ ఆధార్ వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించు కోవాలని, శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలు ఈ కేంద్రం సేవలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉడై ప్రతినిధులు, బీఎల్ఎస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఇది మెగా డీఎస్సీ కాదు ధగా డీఎస్సీ అమర్

## డీఎస్సీ భారీ స్కామ్ పై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్.





అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 01: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసాక, నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా ఉన్న శాఖలో నిర్వహించిన డీఎస్సీ భారీ స్కామ్ పై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్..? తో, ఇది మెగా డీఎస్సీ కాదు ధగా డీఎస్సీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు జిల్లా యువజన విభాగం సారధ్యంలో అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి నాలుగు రోడ్లు జంక్షన్ విచ్చేసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నెహ్రూ చౌక్ జంక్షన్లో కూటమి ప్రభుత్వం నిర్వహించిన ధగా డీఎస్సీ అక్రమాల పై సీబీఐతో విచారణ జరిపించాలనే డిమాండ్ తో..?, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మానవహారం, నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ వెళ్లి కలెక్టర్ కు కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ ధగా డీఎస్సీ అక్రమాల పై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, రీజనల్ కో ఆర్డినేటర్, చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్,

మాజీ ప్రభుత్వ విప్, పిఏసి సభ్యులు, యలమంచిలి నియోజకవర్గం సమన్వయకర్త కరణం ధరశ్రీ, వైఎస్ఆర్సిపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్,

మాజీ శాసనసభ్యులు ఉత్తరాంధ్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, పెందుర్తి నియోజకవర్గం సమన్వయకర్త

అన్నంరెడ్డి అదీప్ రాజ్, మాజీ శాసనసభ్యులు, నర్సీపట్నం నియోజకవర్గం సమన్వయకర్త పెట్ల ఉమా శంకర్ గణేష్, మాజీ శాసనసభ్యులు, పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు, మాజీ పార్లమెంట్ సభ్యురాలు, నర్సీపట్నం నియోజకవర్గం పరిశీలకులు

భీశెట్టి వెంకట సత్యవతి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గం పరిశీలకులు పయిల్ శ్రీనివాసరావు,

రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మనసాల కుమార్ రాజా, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పుల్లేటి వెంకటేష్ పాల్గొని నిరసన తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏడు నియోజకవర్గాల యువజన విభాగం అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, వార్డు అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచులు, రాష్ట్ర, జిల్లా యువజన నాయకులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు అభిమానులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

## ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యత జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.





**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 10:** పీజీఆర్ఎస్ అర్జీలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో ప్రజా గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు డి ఆర్ ఓ., వై.సత్యనారాయణ రావు, డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి లతో కలసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యుత్, తాగునీరు తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను కేవలం సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం కాదని, ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, గడువు ముగియక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ అమలు పనితీరుని శాఖల వారిగా కలెక్టర్ సమీక్షించారు. ఈ-ఆఫీస్ తప్పనిసరిగా అమలు చేయాలని, సిబ్బంది అందరికి లాగిన్ ఉండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాట్సాప్ గవర్నన్స్ పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. ఫిర్యాదులను తిరస్కరించాల్సి వస్తే, దానికి సరైన కారణాలను తెలియజేస్తూ ఫిర్యాదు దారునికి లిఖితపూర్వక సమాచారం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పెండింగ్ అర్జీలు అధికంగా ఉన్న శాఖల అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేస్తూ, సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# డ్రోన్ లతో చల్లేందుకు విత్తనాల గోళీలు తయారు చేయండి

మనం తినే పండ్లతో సామాజిక వనాలు పెంచుదాం.

విత్తన బంతులతో శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలి.

విత్తనాల బంతుల తో పచ్చదనం పరిడవిల్లాలి.

జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ.



**విశాఖపట్నం, పెన్ సత్తా, జూన్ 01:** డ్రోన్ లతో చల్లేందుకు విత్తనాల గోళీలు తయారు చేయండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం ఎంవిపి కాలనీ లో వారు నివసించే ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడారు. విత్తనాల బంతులతో పాటు, విత్తనాల గోళీలు తయారు చేయాలని కోరారు. విత్తన బంతులు మనుషులద్వారా, హెలికాప్టర్లు ద్వారా జల్లవచ్చు అని, ఆరు మిల్లీ మీటర్ల సైజ్ లో తయారు చేసిన విత్తనాల గోళీలు డ్రోన్ లతో కొండలమీద వేయవచ్చు అని వివరించారు. మనం తినే మామిడి పండ్లు, నేరేడు, ఈత, నారింజ, శీతాకాలం, రామాఫలం, సపోటా పండ్ల విత్తనాలు, మన ఇంటి దగ్గరలో లభ్యం అయ్యే పంచదార పళ్ళు, బొడ్డ, కుంకుడుకాయ, చింత, పొగడ, కానుగ, తురాయి, రేల తదితర విత్తనాలతో సామాజిక వనాలు పెంచుదాం అన్నారు. ఈ విధంగా విత్తన బంతులతో శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలి అని కోరారు. విత్తనాల బంతులు తయారు చేయడం అనేది 10 వేల సంవత్సరాల క్రిందట మొదలయ్యింది అని, దీనిని ఆదిమానవులు ఏనుగు లద్దె లో నుండి మొక్కలు రావడం చూసి ఆ విధానం అవలంబించినట్లు చరిత్రకారులు భావిస్తున్నారు. విత్తనాల బంతుల తో పచ్చదనం పరిడవిల్లెలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సమన్వయకర్త జె రాజేశ్వరి, ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ. కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్.

## జిల్లాలో 2,52,328, మందికి రూ.107.56 కోట్లు విడుదల





**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 01:** ప్రతి లబ్దిదారునికి ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు సక్రమంగా అందేలా పంపిణీ పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదేశించారు. సోమవారం నక్కపల్లి, అద్దాల వీధిలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని లబ్దిదారుల ఇంటికి వెళ్లి పించన్లు అందించారు. మహిళలకు, నేతపనివార్లకు వితంతులకు, వృద్దులకు పింఛన్లను కలెక్టర్ స్వయంగా పంపిణీ చేశారు. పింఛన్లు పంపిణీ విధానం పై ఆరా తీసి సక్రమంగా సకాలంలో అందుతున్నది, లేనిది లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న పింఛన్లు పంపిణీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 2,52, 328 మంది లబ్ధిదారులకు రూ.107,56,39,500/- పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధి, 24 గ్రామీణ మండలాల్లో ఉదయం 5 గంటల నుంచే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. శతశాతం పెన్షన్లు పంపిణీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చినదొడ్డిగల్లు లో సరుగుడు తోట దగ్ధం


## ఇది వర్గాలపై వేరువేరు కేసుల నమోదు



**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 01:** నక్కపల్లి మండలం, చినదొడ్డుగల్లు లో జరిగిన సరుగుడు తోట దగ్ధం ఘటనకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదయ్యాయి. నక్కపల్లి సిఐ జె మురళి అందించిన వివరాలు ప్రకారం

కర్రి అప్పారావు తండ్రి అపన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు, తేదీ 30-05-2026 న తన సరుగుడు తోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి కాల్చివేశారని, ఈ ఘటనలో గట్టెం బాబ్జి, గట్టెం మల్లేశ్వరరావు, నరిసే నారాయణరావు,మరి కొంతమంది ప్రమేయం ఉన్నట్లు నక్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అలాగే ఇదే ఘటనకు సంబంధించి గట్టెం బాబురావు తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమకు చెందిన 1. 62 ఎకరాల సరుగుడు తోట కాలిపోయిందని, ఈ ఘటనలో గ్రామానికి చెందిన కర్రి అప్పారావు, కర్రి శ్రీనివాసరావు, కర్రి నానాజీ లు ప్రమేయం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ పిర్యాదు చేశారు.ఇరువర్గాల ఫిర్యాదుల ఆధారంగా రెండు వేర్వేరు కేసులు నమోదు చేయడం జరిగిందని సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి, ఇరువర్గాల ఫిర్యాదులపై విచారణ కొనసాగిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సోమవారం ఎస్ ఐ సన్నిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.విచారణలో తేలే వాస్తవాలు, సాక్ష్యాధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని సి ఐ మురళి తెలిపారు.

## కాగితలో ఘనంగా వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవ వేడుకలు



**నక్కపల్లి, పెన్ సత్తా, జూన్ 01:** మండలంలో కాగిత గ్రామంలో వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. దీనిలో భాగంగా ఉదయం స్వామివారిని గజమాలతోను, ఆలయాన్ని పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామానికి చెందిన పోతంశెట్టి నారాయణరావు దంపతులచే పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ వద్ద భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వందలాదిమంది భక్తులు అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పోతంశెట్టి రాజేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఫార్మా వ్యర్థ జలాలు మొల్లోడి గడ్డ లోకి రాకుండా శాశ్వత పరిష్కారం చేయాలి.

### సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గనిశెట్టి డిమాండ్.





**పరవాడ, పెన్ సత్తా, జూన్ 01:** మండల కేంద్ర మైన పరవాడ నుండి అనకాపల్లి మార్గం లోని బర్ణికం సమీపంలో మొల్లోడు గడ్డలో ఫార్మా వ్యర్థ రసానికి జలాలను విడుదల చేసిన విశాఖ ఫార్మాసిటీ (రాంకీ) యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి అని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన వ్యర్థ రసానికి జలాలు విడుదల చేసిన మెల్లోడు గడ్డను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల వ్యర్థ రసానికి జలాలు వర్షం పడితే మొల్లేడుగడ్డలో దర్శనమిస్తున్నాయని దానికి కారణం రామ్కీ యాజమాన్యం సక్రమంగా నిర్వహణ బాధ్యతలు చేపట్టకపోవడం వలన నిత్యం వ్యర్థ రసానికి జలాలు ఈ గడ్డలో చేరుతున్నాయని, ఇప్పటి కైనా యాజమాన్యం శాశ్వత మైన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఎన్నిసార్లు హెచ్చరికలు చేసిన, ప్రభుత్వానికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన చీమకుట్టినట్లు కూడా యాజమాన్యానికి లేకపోవడం విచారకరమన్నారు. దీనివలన భూ గర్భ జలాలను నాశనం అవుతున్నాయని ప్రజల ఆరోగ్యాలు కాలుష్యం వలన తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. దీని పై జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలియజేశారు.

## ఉజ్బెకిస్తాన్ లో అనకాపల్లి మహిళ ప్రతిభ





**అనకాపల్లి, పెన్ సత్తా, జూన్ 01:** అనకాపల్లి వాసులు గర్వపడేలా, గౌరీ పుత్రుల స్థాయిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన డా. కె.జీ.బీ. సంతోష్ కుమారి.

అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ విద్యావేత్త, ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థిని డా. కె.జీ.బీ. సంతోష్ కుమారి ఉజ్బెకిస్తాన్ దేశం లోని మినిస్ట్రీ అఫ్ ప్రెస్కూల్ అండ్ స్కూల్ ఎడ్యుకేషన్ లో ఎక్స్పర్ట్ కౌన్సిల్ -- ఎడ్యుకేషనల్ స్పెషలిస్ట్ గా ప్రతిష్టాత్మక బాధ్యతలు స్వీకరించడం పట్ల అనకాపల్లి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గవరపాలెంకు చెందిన కాండ్రేగుల గంగరాజు సత్యవతి దంపతుల కుమార్తె అయిన డా. సంతోష్ కుమారి విద్య, కృషి, పట్టుదల, ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు సాధించి అనకాపల్లి ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పారు.

ఒక సాధారణ కుటుంబం నుంచి ఎదిగి ప్రపంచ విద్యా రంగంలో కీలక బాధ్యతలు చేపట్టడం ద్వారా ఆమె యువతకు, ముఖ్యంగా మహిళలకు ఆదర్శంగా నిలిచారు. విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆమె జీవితం మరోసారి నిరూపించింది.ఉజ్బెకిస్తాన్ విద్యా రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించబోతున్న ఈ బాధ్యతలకు ఎంపిక కావడం అనకాపల్లి జిల్లాకే కాకుండా తెలుగు రాష్ట్రాలకు, భారతదేశానికే గర్వకారణంగా నిలిచింది.అనకాపల్లి గర్వపడేలా గౌరీ పుత్రుల స్థాయిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన డా. కె.జీ.బీ. సంతోష్ కుమారి కి అనకాపల్లి గౌరీ పుత్రుల తరపున హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసారు.

ఆమె మరిన్ని ఉన్నత విజయాలు సాధించి భారతదేశానికి, తెలుగు ప్రజలకు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాము అని స్థానికులు తెలిపారు.

## దిశానిర్దేశంతో ట్రాఫిక్ సులభతరం వాహనదారుల హర్షం.



**విజయవాడ, పెన్ సత్తా, జూన్ 01:** పెద్ది సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం పర్యవేక్షణలో ట్రాఫిక్ ఏసీపీలు, సిబ్బంది చేపట్టిన ప్రత్యేక దిశానిర్దేశ చర్యలు వాహనదారుల ప్రశంసలు అందుకుంటున్నాయి. కార్యక్రమానికి హాజరయ్యే అభిమానులు, అతిథులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పార్కింగ్ ప్రాంతాలకు చేరుకునేలా ప్రధాన కూడళ్లు, జంక్షన్లు, పార్కింగ్ ప్రాంతాల వద్ద ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేకంగా క్యూ ఆర్ కోడ్లతో కూడిన దిశానిర్దేశక ప్లకార్డులను ఏర్పాటు చేసి మార్గనిర్దేశం చేస్తున్నారు. ప్లకార్డుల పై ఉన్న క్యూ ఆర్ కోడ్ను స్కాన్ చేయడం ద్వారా వాహనదారులు తమకు కేటాయించిన పార్కింగ్ ప్రాంతానికి సులభంగా చేరుకునే అవకాశం కల్పించారు. ఈ వినూత్న చర్యతో వాహనదారులు సరైన మార్గాల్లో ప్రయాణించి తమ వాహనాలను నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లో నిలిపివేయగలుగుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.ప్రజల సౌకర్యం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, కార్యక్రమం విజయవంత మైన నిర్వహణ లక్ష్యంగా చేపట్టిన ఈ ముందు చూపు చర్య పై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ ట్రాఫిక్ అధికారులను అభినందిస్తున్నారు.

## సంపాదకీయం

# యుద్ధం ఆపలేని యుక్తి!

రాజకీయ చరిత్రలో నిర్ణయాత్మక క్షణాలు అరుదు. ఆ సమయంలో -నాయకులు ఒక్కో అడుగు వేసే తీరు చరిత్రను మలుపు తిప్పుతుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోని సిచ్యుయేషన్ రూంలో శుక్రవారం కూర్చున్న సమావేశం కూడా అలాంటిదే. ఇరాన్‌తో యుద్ధ విరమణను మరో అరవై రోజులు పొడిగించాలా వద్దా? హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలా వద్దా? అన్న కీలకమైన నిర్ణయం తీసుకోవడానికి ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశపు అధ్యక్షుడు రెండు గంటలు తన సలహాదారులతో చర్చించాడు. అయినా సరే -ఎటూ తేల్చలేదు. ఒప్పందం కుదిరిందా? అంటే లేదు! చర్చలు విఫలమయ్యాయా? అంటే అదీ కాదు! ఈ అనిశ్చితే ప్రపంచానికి ఇప్పుడు అత్యంత ప్రమాదకరమైన స్థితి. సాగని నిర్ణయం, ఆగని యుద్ధం -రెండూ కలిసి పశ్చిమాసియాను అగ్గిముందు నిలబెడుతున్నాయి.

ట్రంప్ తేల్చుకోలేకపోవడానికి కారణాలు ఉన్నాయి. ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికాకు ఉన్న భయాలు నిజమైనవే. అణుబాంబు తయారు చేయనని హామీ ఇవ్వాలని ట్రంప్ పట్టుబట్టడం కేవలం రాజకీయ ఆటలా కనిపించవచ్చు. కానీ దాని వెనుక ఉన్న భద్రతా ఆందోళనలను కొట్టిపారేయలేం. ఇరాన్ అణు సామర్థ్యం ఒకసారి పూర్తిగా అభివృద్ధి చెందితే పశ్చిమాసియా సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. ఇజ్రాయెల్ అస్తిత్వమే ప్రశ్నార్థకం కావొచ్చు. సౌదీ అరేబియా, యూఏఈవంటి దేశాలు తమ సొంత అణు కార్యక్రమాలు మొదలుపెడతాయి. అందుకే -ట్రంప్ ఈ విషయంలో రాజీ పడటం కష్టమే. అయితే ఇరాన్ దృష్టికోణం నుండి చూస్తే పరిస్థితి వేరు. యుద్ధ విరమణ గురించి మాట్లాడుతూనే అణు ప్రణాళికపై చర్చించే అంశాన్ని పక్కన పెడుతుంది. "మేం యుద్ధం ముగించే అంశంపైనే దృష్టి పెట్టాం. ప్రస్తుతం అణు ప్రణాళికపై చర్చించడం లేదు" అని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టంగా ప్రకటించింది. రెండు విభిన్న అంశాలను ముడిపెట్టి చర్చలు జరపడం సమస్యను మరింత జటిలం చేస్తుంది. శాంతి చర్చలను ఆయుధంగా వాడటం -ఇది దౌత్యం కాదు, దౌత్య వైఫల్యానికి నాంది!

ఇక్కడ మరో కీలకమైన అంశం ఉంది. ఏ ఒప్పందం కుదిరినా అందులో ఇజ్రాయెల్-హిజ్బుల్లా మధ్య సంధి కూడా ఉండాలని ఇరాన్ పట్టుబట్టడం దాని వ్యూహాత్మక లక్ష్యాలను స్పష్టంగా చెప్పకనే చెప్తోంది. హిజ్బుల్లా ఇరాన్‌కు కేవలం ప్రాక్సీ మాత్రమే కాదు -అది టెహ్రాన్ యొక్క పశ్చిమాసియా పలుకుబడికి వ్యూహాత్మక స్తంభం. హిజ్బుల్లాను రక్షించడం అంటే తన సొంత ప్రాంతీయ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడమే. అందుకే ఇరాన్ ఈ షరతుపై రాజీపడదు. ఈ చర్చలు జరుగుతున్నవేళ నేలపై పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. దక్షిణ లెబనాన్‌లోకి ఇజ్రాయెలీ సైన్యం మరింత లోతుగా చొచ్చుకుపోతోంది. హిజ్బుల్లాకు గట్టి పట్టున్న నబాటియా నగరం దిశగా సైనిక కదలికలు సాగుతున్నాయి. ఇజ్రాయెల్ దాడుల్లో ముగ్గురు చనిపోయారు. ఉత్తర ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా రాకెట్ల దాడులు ఆగడం లేదు. హర్మూజ్ జలసంధిలో దిగ్బంధనాన్ని ఉల్లంఘించడానికి ప్రయత్నించిన వాణిజ్య నౌకను అమెరికా సైన్యం అడ్డుకుంది. అంటే -టేబుల్ మీద చర్చలు జరుగుతున్నా నేలపై యుద్ధం నిరాటంకంగా సాగుతోంది. ఈ రెండు వాస్తవాలు ఒకే సమయంలో ఉనికిలో ఉండటం చర్చల హాస్యాస్పద స్వభావాన్ని బట్టబయలు చేస్తున్నట్టే.

హర్మూజ్ జలసంధి మూసుకుపోయి ఉండటం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రతిరోజూ వందల కోట్ల డాలర్ల నష్టం. ప్రపంచంలో సగానికి పైగా చమురు ఈ జలసంధి మీదుగానే రవాణా అవుతుంది. ఆసియా దేశాలు, యూరప్, అమెరికా.. అన్నీ ఈ మార్గంపై ఆధారపడి ఉన్నాయి. పెట్రోలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్య మనిషి జీవితం కుదేలవుతోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ నిర్ణయం తీసుకోలేకపోవడం కేవలం దౌత్యపరమైన విఫలత మాత్రమే కాదు -అది ఆర్థికపరమైన నేరం కూడా! ఒప్పందం కుదిరితే చమురు ధరలు దిగుతాయి. వ్యాపారాలు తెరుచుకుంటాయి. ప్రజలకు ఊరట కలుగుతుంది. కానీ అమెరికా అధ్యక్షుడు ఆ ఊరట ఇవ్వడానికి ఇంకా సిద్ధంగా లేరు.

ట్రంప్ నిర్ణయం వాయిదా వేయడం వ్యూహాత్మక లెక్కల నుంచి పుట్టిందా, అంతర్గత రాజకీయ ఒత్తిళ్లనుంచి పుట్టిందా అన్నది స్పష్టంగా తెలియడం లేదు. రిపబ్లికన్ పార్టీలో ఒక వర్గం ఇరాన్‌పై మరింత కఠినంగా ఉండాలని డిమాండ్ చేస్తోంది. మరోవర్గం యుద్ధం పొడగించకూడదని హెచ్చరిస్తోంది. ఇజ్రాయెల్ లాబీ ఒత్తిడి వేరేగా ఉంది. సైనిక సలహాదారులు మరో దిక్కు చూపిస్తున్నారు. ఈ నాలుగు దిక్కుల ఒత్తిళ్ల మధ్య ట్రంప్ ఏ దిశలో వెళ్ళాలో తేల్చుకోలేకపోతున్నారు. ఇది వ్యక్తిగత నిర్ణయ వైఫల్యం మాత్రమే కాదు -అమెరికా విదేశాంగ విధానంలోని సంక్లిష్ట వైరుధ్యాల ప్రతిఫలనం కూడా. చరిత్ర ఎప్పుడూ నిర్ణయం తీసుకున్న నాయకులను గుర్తుంచుకుంటుంది -మంచిదైనా, చెడుదైనా! నిర్ణయం తీసుకోకుండా మిన్నకుండే నాయకులను చరిత్ర క్షమించదు. ట్రంప్ ఇప్పుడు ఆ మిన్నకుండే పాత్రలో ఉన్నారు. ఇరాన్‌తో ఒప్పందం కుదరకపోతే జరిగే నష్టాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. హర్మూజ్ మూసుకుపోవడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడం, పశ్చిమాసియా మరింత అస్థిరపడటం, ఇజ్రాయెల్-హిజ్బుల్లా సంఘర్షణ తీవ్రతరం కావడం. ఈ పరిణామాలు ఒకదాన్నొకటి మించి ముందుకు దూసుకుపోతాయి. ఒప్పందం చేసుకున్నా నష్టాలు ఉంటాయి. అణు విషయంలో రాజీ పడినట్టవుతుంది. ఇరాన్‌కు ఊరట లభిస్తుంది. అయితే రెండు నష్టాలను తూకంవేస్తే ఒప్పందంవైపే మొగ్గు మెండు.

శాంతి ఎప్పుడూ నిర్దోషమైన నిర్ణయాల ద్వారా రాదు. అది అసంపూర్ణమైన, అసౌకర్యమైన రాజీల నుండే పుడుతుంది. ట్రంప్ అర్థం చేసుకోవలసిన సత్యమిదే. అరవై రోజుల విరమణ పొడిగింపు అంటే అరవై రోజుల అమూల్యమైన చర్చల అవకాశం. హర్మూజ్ తెరుచుకోవడం అంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు శ్వాస అందడం. ఈ రెండూ అణు చర్చలను కొనసాగించే అవకాశాన్ని తగ్గించవు, పెంచుతాయి. అందుకే ఎటూ తేల్చకుండా ఉండటం ఒక వ్యూహం కాదు, అది వ్యూహరాహిత్యం. ట్రంప్ ఈ వ్యూహరాహిత్యం నుండి బయటపడి నిర్ణయం తీసుకోవాలి. ఒప్పందం కుదర్చాలి లేదా స్పష్టంగా తిరస్కరించాలి. రెండు కుర్చీల మధ్య వేలాడటం అమెరికాకే కాదు, ప్రపంచ శాంతికీ మంచిది కాదు!



# తాగితే పోతాం.. మరి మానేస్తే..!?

ధూమపానం ఆరోగ్యానికి హానికరం అని తెలిసినప్పటికీ చాలా మంది దానికి బానిసలవుతుంటారు. అయితే, ధూమపానం మానేయాలని నిర్ణయించుకోవడం ఒక వ్యక్తి జీవితంలో చేసే అతి ముఖ్యమైన మరియు సానుకూలమైన ఎంపికలలో ఒకటి. పొగతాగడం ఆపేసిన కొద్ది క్షణాలనుంచే మానవ శరీరం తనను తాను నయం చేసుకునే అద్భుతమైన ప్రక్రియను ప్రారంభిస్తుంది. ఈ రికవరీ ప్రక్రియ క్రమంగా సాగినప్పటికీ, నిమిషాలు, గంటలు మరియు సంవత్సరాల వ్యవధిలో శరీరంలో వచ్చే సానుకూల మార్పులు భవిష్యత్తులో వచ్చే ప్రాణాంతక వ్యాధుల ప్రమాదాలను దూరం చేస్తాయి. ధూమపానం మానేసిన వెంటనే శరీరంలో అద్భుత మార్పులు చోటుచేసుకుంటాయని వైద్యులు విశ్లేషిస్తున్నారు.

బిడిఆర్ ఫార్మాస్యూటికల్స్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ అరవింద్ బాడిగర్... హెచ్‌టి లైఫ్‌స్టైల్‌కు ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో అనేక అంశాలను ప్రస్తావించారు. ధూమపానం నిలిపివేసిన తర్వాత మానవ శరీరం మానసికంగా, శారీరకంగా ఎలా స్పందిస్తుందో మరియు నష్టాన్ని ఎలా తిప్పికొడుతుందో వివరంగా డీకోడ్ చేశారు.

డాక్టర్ అరవింద్ ప్రకారం.... పొగతాగడం తక్షణమే ఆపడంవల్ల శరీరంలో చాలా వేగంగా కింది శారీరక మార్పులు వస్తాయి.

20 నిమిషాలు: ధూమపానం ఆపేసిన కేవలం 20 నిమిషాల్లోనే పెరిగిన హృదయ స్పందన రేటు, రక్తపోటు సాధారణ స్థితికి రావడం ప్రారంభిస్తాయి. 12 గంటలు: రక్తంలో కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు తగ్గి, ఆక్సిజన్ స్థాయిలు మెరుగుపడతాయి. 24 నుండి 72 గంటలు: శ్వాసనాళ గొట్టాలు విశ్రాంతి స్థితికి చేరుకుంటాయి. దీనివల్ల ఊపిరి పీల్చుకోవడం చాలా సులభంగా మారుతుంది. 2నుంచి 12 వారాలు: శరీరంలో రక్త ప్రసరణ వ్యవస్థ మరియు ఊపిరితిత్తుల పనితీరు గణనీయంగా మెరుగుపడతాయి. దీర్ఘకాలంగా ధూమపానం చేసేవారి గుండెపై ఈ మార్పుల వల్ల ఒత్తిడి ఊహించని విధంగా తగ్గుతుందని... ఇది శరీరం యొక్క అద్భుతమైన కోలుకునే సామర్థ్యాన్ని చూపుతుందని డాక్టర్ అరవింద్ వివరించారు.

దీర్ఘకాలిక రికవరీ:

ధూమపానానికి నెలలు, సంవత్సరాల పాటు దూరంగా ఉండటం వల్ల ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం కింది విధంగా తగ్గుతుంది:

ఏడాది: గుండెకు సంబంధించిన 'కారోనరీ హార్ట్ డిసీజ్' వచ్చే ప్రమాదం సగానికి పైగా తగ్గుతుంది. ఐదేళ్లు: రక్త నాళాలు పూర్తిగా కోలుకోవడంతో స్ట్రోక్ (క్షీణించిన పక్షవాతం) వచ్చే ముప్పు గణనీయంగా తగ్గుతుంది. పదేళ్లు: చురుగ్గా పొగతాగే వారితో పోలిస్తే ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే సంభావ్యత సగానికి పైగా పడిపోతుంది. పదిహేనేళ్లలో: గుండెజబ్బులు వచ్చే ప్రమాదం, అసలు ధూమపానం చేయని సాధారణ వ్యక్తి శరీర స్థాయికి చేరుకుంటుంది.

ధూమపానం మానేసిన ప్రారంభ రోజుల్లో, మెదడుకు నికోటిన్ అందకపోవడం వల్ల శరీరం కొంత అసౌకర్యానికి గురవుతుంది. దీనినే 'నికోటిన్ ఉపసంహరణ లక్షణాలు' అంటారు. దీనివల్ల వ్యక్తుల్లో మళ్లీ పొగతాగాలనే బలమైన కోరిక, మానసిక స్థితిలో మార్పులు, చిరాకు, ఆందోళన, ఏకాగ్రత లేకపోవడం, నిద్రలేమి మరియు తినే అలవాట్లలో మార్పులు వంటి తాత్కాలిక సమస్యలు ఎదురవుతాయి.

ఇదే సమయంలో శ్వాసకోశ వ్యవస్థ పునరుద్ధరణ వేగంగా జరుగుతుంది. ఊపిరితిత్తులలోని చిన్న జుట్టులాంటి నిర్మాణాలు (సిలియా) మళ్లీ చురుగ్గా మారి, లోపల పేరుకుపోయిన శ్లేష్మం (కఫం), విషపూరిత పదార్థాలను బయటకు నెట్టివేస్తూ ఊపిరితిత్తులను శుభ్రపరుస్తాయి. ధూమపానం మానేయడం వల్ల దాదాపు ప్రతి శారీరక వ్యవస్థ సానుకూల మార్గంలో మెరుగుపడుతుందని డాక్టర్ అరవింద్ స్పష్టం చేశారు.

# తూర్పు ఆసియాకు హెల్సింకీ పాఠం!

హర్మూజ్ మూసివేత, ఉక్రెయిన్ యుద్ధం, కోవిడ్ మహమ్మారి -ఈ మూడు సంక్షోభాలు తూర్పు ఆసియా దేశాలకు ఒక కఠినమైన సత్యాన్ని చాటాయి. వాషింగ్టన్ చేతుల్లో భద్రత వదిలేస్తే సమృద్ధి సురక్షితంగా ఉండదు. అందుకే -1975లో యూరప్ శీతల యుద్ధాన్ని నిర్వహించుకున్న హెల్సింకీ మార్గంలో తూర్పు ఆసియా దేశాలు తమ భద్రతా చట్రాన్ని తాముగా నిర్మించుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది.



2020 నుండి జరిగిన మూడు పెద్ద సంక్షోభాలు తూర్పు ఆసియా భద్రత గురించి దశాబ్దాలుగా నిలిచిన అంచనాలను పూర్తిగా తలకిందులు చేశాయి. మొదటిది -కోవిడ్-19 మహమ్మారి. ప్రపంచ సరఫరా వ్యవస్థలను ఒక్క క్షణంలో కుప్పకూల్చగలవని నిరూపించింది. రెండవది -ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం. భూభాగ ఆక్రమణ మళ్లీ సాధ్యమేనని చాటింది; తూర్పు ఆసియాలో కూడా ఇలాంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయనే భయాన్ని రేకెత్తించింది. మూడవది.. అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ సంఘర్షణ. హర్మూజ్ జలసంధిని వాణిజ్య నౌకాయానానికి దాదాపు మూసివేసింది. ఈ జలసంధి గుండా రోజుకు సుమారు రెండు కోట్ల బారెళ్ల చమురు ప్రవహిస్తుంది; అందులో దాదాపు తొంభైశాతం ఆసియా మార్కెట్లకే వెళ్తుంది. చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియా ఇంధన కొరత భరిస్తుండగా, వాషింగ్టన్ తన నౌకాదళ మిషన్ ద్వారా ముఖ్యంగా తన స్వప్రయోజనాలనే పరిరక్షించుకుంటోంది. దీనికితోడు అమెరికా వాణిజ్య విధానాల్లో పెరిగిన ఏకపక్ష ధోరణి, తీవ్రమవుతున్న అమెరికా-చైనా పోటీ, పరిష్కారంకాని భూభాగ వివాదాలు -ఇవన్నీ కలిసి ఒక కీలక ప్రశ్న లేవనెత్తుతున్నాయి. తూర్పు ఆసియా దేశాలు తమ సొంత భద్రతకు తాముగా బాధ్యత తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందా? గత మూడు దశాబ్దాలుగా అమెరికా నాయకత్వంలోని భద్రతా నిర్మాణంపై ఆధారపడిన తూర్పు ఆసియా దేశాలు ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలు వెతకాల్సిన పరిస్థితిలో పడ్డాయి.


ఈ ప్రశ్నకు సమాధానం వెతికే క్రమంలో 1975నాటి హెల్సింకీ ఒప్పందం ఒక ఆదర్శ నమూనాగా ముందుకు వస్తోంది. యూరప్‌లో భద్రత, సహకారంపై జరిగిన కాన్ఫరెన్స్ 1973లో ప్రారంభమై 1975లో ముగిసింది. 35 దేశాల అధినేతలు హెల్సింకీ ఫైనల్ యాక్ట్‌పై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం మూడు స్తంభాలపై నిర్మితమైంది. సార్వభౌమత్వం, శాంతియుత వివాద పరిష్కారం, మానవ హక్కులు; ఆర్థిక-పర్యావరణ సహకారం; మానవీయ సహకారం. అత్యంత కీలకమైన విషయమేమిటంటే -హెల్సింకీ శీతల యుద్ధాన్ని పరిష్కరించలేదు, కేవలం నిర్వహించగలిగింది. సరిహద్దుల అలంఘనీయతను నిర్ధారిస్తూనే వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని నిబంధన విధించడం వల్ల రెండు వర్గాలకూ తమకు కావలసిందేదో లభించింది. తర్వాత బెల్‌గ్రేడ్, మాడ్రిడ్, వియన్నాలో జరిగిన ఆవర్తన సమావేశాలు చివరకు "యూరప్‌లో భద్రత-సహకార సంస్థ"గా రూపాంతరం చెందాయి. యూరప్ సాధించిన ఈ దీర్ఘకాలిక సంభాషణ సంస్కృతే తూర్పు ఆసియాకు అత్యంత అవసరమైన పాఠం.

తూర్పు ఆసియాలో సీఎస్‌సీఈఏ అతి కష్టమైన సమస్యలతో మొదలుపెట్టాల్సిన అవసరం లేదు. ఇంధన భద్రత విషయంలో వ్యూహాత్మక నిల్వల సమన్వయ విడుదల, ఉమ్మడి నౌకా చార్టరింగ్, గల్ఫ్ ఉత్పత్తిదారులతో సమష్టి చర్చలు సాధ్యమే. వాతావరణ విపత్తు నిర్వహణలో ఫుకుషిమా తరహా అప్రమత్తత వ్యవస్థను విస్తరించవచ్చు. హిరోషిమా ఏఐ ప్రక్రియ, సియోల్ ఏఐ సమ్మిట్ పునాదులపై కృత్రిమ మేధ నియంత్రణ ప్రమాణాలు రూపొందించవచ్చు. సైబర్ భద్రత, యుఎన్‌సీఎల్‌ఓఎస్ సూత్రాల ఆధారంగా సముద్ర మార్గాల స్వేచ్ఛలో ప్రవర్తనా నిబంధనలు నిర్ణయించవచ్చు. ఈ విధంగా చిన్నచిన్న విజయాలు సాధిస్తూ పెద్ద సమస్యలను చర్చించే వాతావరణం క్రమంగా నిర్మించవచ్చు.

అయినప్పటికీ, సెంకాకు/ దయోయు దీవులు, స్ప్రాట్లీ-పారాసెల్ దీవులు, చైనా-భారత్ సరిహద్దు, తైవాన్ ప్రశ్నవంటి సంక్లిష్ట వివాదాల పటం అధిగమించడం సులభం కాదు. ఈ వివాదాల్లో చాలావరకు ప్రస్తుతం తప్పుదోవలో పయనిస్తున్నాయి. గ్రే-జోన్ ఘటనలు తీవ్రమవుతున్నాయి. హెల్సింకీ స్ఫూర్తితో ఇరవై సంవత్సరాలపాటు అన్ని వివాదాలను స్తంభింపజేసే ఒప్పందం ప్రతిపాదన ఆకర్షణీయంగా ఉంది. కొత్త నిర్మాణాలు లేవు, బలప్రయోగం లేదు, తుది పరిష్కారానికి అడ్డంకి లేదు. అయితే జపాన్, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్ అమెరికా భద్రతా హామీలపై ఆధారపడతాయి; వాషింగ్టన్‌ను పక్కకు నెట్టినట్టు కనిపించే నిర్మాణానికి వారి మద్దతు పొందడం పెద్ద సవాలే. ఆసియాన్ తన కేంద్రస్థానం ప్రశ్నింపబడుతోందని భావించవచ్చు. అందువల్ల సీఎస్‌సీఈఏ అమెరికాకు ప్రత్యర్థిగా కాక, ఇప్పటికే ఉన్న నిర్మాణాలను పూరించే భాగస్వామిగా చిత్రీకరించడం వ్యూహాత్మకంగా తెలివైన పని. ఈ సంకోచాలన్నీ అధిగమించాలంటే దౌత్యపరమైన నేర్పు, దీర్ఘకాలిక సంయమనం అవసరం.

చైనా, జపాన్, భారత్, దక్షిణ కొరియా, ఇండోనేషియా, సింగపూర్, వియత్నాం -ఈ ఏడు అతిపెద్ద తూర్పు ఆసియా ఆర్థిక వ్యవస్థలు కలిసి ప్రాంతీయ జీడీపీ, ఇంధన వినియోగం, నౌకాదళ శక్తిలో సింహభాగాన్ని ప్రతినిధిస్తాయి. 2024 సియోల్ శిఖరాగ్ర సమావేశంలో పునరుజ్జీవనం పొందిన చైనా-జపాన్-దక్షిణ కొరియా త్రైపాక్షిక మేళనం ఈ దిశలో ఒక మంచి సంకేతం. భారత్ ఈ ఆరు దేశాలన్నిటికీ వ్యూహాత్మక భాగస్వామిగా ఉండడం మరో అనుకూల అంశం. ఈ ఏడు ప్రభుత్వాలు ప్రముఖ థింక్ ట్యాంకుల నేతృత్వంలో ట్రాక్ 1.5 ప్రక్రియకు ఆదేశమివ్వాలి; 12-18 నెలల్లో ఆసియాన్‌తో సంప్రదింపులు జరిపి ఒక చట్రం "ఫైనల్ యాక్ట్"ను రూపొందించాలి. ఈ ప్రక్రియలో చిన్న దేశాల ఆందోళనలను కూడా సమానంగా పరిగణించాలి; లేకుంటే ఈ నిర్మాణం కేవలం పెద్ద శక్తుల వేదికగా మాత్రమే మిగిలిపోతుంది.

హర్మూజ్ మూసివేత ఒక నిర్ణయాత్మక సత్యాన్ని స్పష్టంగా నిరూపించింది. తూర్పు ఆసియా సమృద్ధి సముద్ర మార్గాలపై, ఇంధన ప్రవాహాలపై, సమష్టిగా రక్షించుకోవాల్సిన నిబంధనలపై నిలిచి ఉంది. సీఎస్‌సీఈఏ హెల్సింకీలా అన్ని వివాదాలనూ పరిష్కరించదు. కానీ అవి నిర్వహించబడే పరిస్థితులను మారుస్తుంది. చరిత్ర చూపినట్టు, సంభాషణ సంస్కృతి ఒకసారి స్థిరపడిందంటే అది శాంతికి పటిష్టమైన పునాది అవుతుంది. ఆసియన్లు తమ భద్రతకు తామే బాధ్యత వహించాల్సిన శకం ఆరంభమైంది. ఆ అవకాశాన్ని వదులుకుంటే రాబోయే సంక్షోభం మరింత తీవ్రంగా ముంచుకొస్తుందనటంలో సందేహం లేదు. ■



లక్ష్యం దిశగా చేసే ప్రయాణంలో అడ్డంకులు ఎదురవడం సహజం. అయితే ప్రతికూల భావనతో ఉండేవారు వాటిని చూసి నిరాశా నిస్పృహలతో అక్కడే ఆగిపోతే, సానుకూల దృక్పథంతో ఉండేవారు మాత్రం అడ్డంకుల్లోనే అవకాశాలను వెతుక్కొని మరింత ఉత్సాహంతో ముందుకెళ్తారు. ఎందుకంటే వారికి అడ్డంకి అంటే ముగింపు సంకేతం కాదు, అది తమలో దాగిన సామర్థ్యాన్ని వెలికితీసే పరీక్ష మాత్రమే. అందుకే జీవితంలో విజయం సాధించినవారు అడ్డంకులు లేనివారు కాదు.. వాటిని అవకాశాలుగా మార్చుకున్నవారు, అవకాశాలనే ఆయుధాలుగా మలచుకున్న వారని గ్రహించాం.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# వారెవా



ఒక్క గాలన్ పెట్రోల్‌తో న్యూయార్క్ నుంచి లాస్‌ఏంజెలెస్ వరకూ వెళ్ళగలిగితే?

అమెరికాలోని బ్రింగ్‌హాం యంగ్ యూనివర్శిటీ విద్యార్థులు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. కేవలం 49 కిలోల కార్బన్ ఫైబర్ శరీరంతో, టెస్ట్ ట్యూబంత చిన్న ఇంధన ట్యాంక్‌తో "సూపర్‌మైలేజ్" అనే అద్భుత వాహనాన్ని తయారు చేశారు. ఒక్క గాలన్ ఇంధనంతో ఏకంగా 2,145 మైళ్లు పరుగెత్తగలదు ఈ కారు! పోలికకు చెప్పాలంటే -మన సాధారణ కారు గాలన్‌కు 15 మైళ్లు తిరిగితే, ఇది 143 రెట్లు ఎక్కువ సాగుతుంది. అయితే గంటకు కేవలం 23 మైళ్ళ వేగంతో, ప్రతి 20 మైళ్ళకూ ఆగి ట్యాంక్ నింపుకోవాల్సి వస్తుంది. అంటే యూటా నుంచి న్యూయార్క్ ప్రయాణం సాధ్యమే, కానీ... జీవితకాలం పట్టవచ్చు!

సోర్ప్స్

# ఛాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ మార్పు.. జూన్ కాదు ఫిబ్రవరిలో..!

అంతర్జాతీయ క్రికెట్ మండలి తొలిసారి నిర్వహించ తలపెట్టిన మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ తేదీ మారింది. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది జూన్‌లో టోర్నమెంట్ జరగాలి. కానీ, ఈ మెగా ఈవెంట్‌ను అంతకంటే ముందుగానే ఆడించాలని ఐసీసీ తీర్మానించింది. 2027 ఫిబ్రవరిలో 10 జట్లతో ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహించాలని నిర్ణయించింది. ఐపీఎల్ 19వ సీజన్ ఫైనల్ అనంతరం అహ్మదాబాద్‌లో జరిగిన త్రైమాసిక సమావేశంలో ఐసీసీ పెద్దలు షెడ్యూల్ మార్పునకు ఆమోదం తెలిపారు. వరల్డ్‌కప్ వంటి ఐసీసీ ఈవెంట్లలో సమాన నగదు బహుమతితో మహిళా క్రికెట్ అభివృద్ధికి బాటలు వేసిన ఐసీసీ ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీతో అతివల ఆటను మరో మెట్టు ఎక్కించాలనుకుంటోంది. అందులో భాగంగానే వచ్చే ఏడాది(2027) జూన్ -- జూలైలో టోర్నీ జరపాలని ఐసీసీ భావించింది. కానీ, ఫిబ్రవరిలో ఈ మెగా టోర్నీని నిర్వహించాలని నిర్ణయించింది. అహ్మదాబాద్‌లో ఆదివారం




అధ్యక్షుడు జై షా నేతృత్వంలో సమావేశమైన ఐసీసీ సభ్యులు షెడ్యూల్ మార్చాలని, ఫిబ్రవరిలో 10 జట్లతో టోర్నీ జరపాలని తీర్మానించారు. దాంతో.. 2027 ఫిబ్రవరిలో ఐదు పూర్తిస్థాయి సభ్య దేశాలు, ఐదు అసోసియేటెడ్ దేశాలు.. మొత్తం 10 జట్లు ఛాంపియన్స్ ట్రోఫీ తొలి సీజన్‌లో తలపడనున్నాయి.

**జూన్ 12 నుంచి**

తొలుత 8 జట్లతో మహిళల ఛాంపియన్స్ ట్రోఫీని జరపాలని 2022లో ఐసీసీ భావించింది. మహిళా క్రికెట్ సభ్య దేశాలు అందుకు అంగీకరించడంతో 2027 జూన్‌లో టోర్నీ నిర్వహించాలని అనుకున్నారు. అయితే.. న్యూజిలాండ్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనలో ఆరు మ్యాచ్‌లు ఆడనుంది. అదే సమయంలో జూన్ 12 నుంచి మహిళల పొట్టి ప్రపంచకప్ మొదలవ్వనుంది. దాంతో, ఛాంపియన్స్ ట్రోఫీని ఫిబ్రవరిలో జరపడమే సబబు అని ఐసీసీ బృందం ఆలోచన చేసింది.

## మహిళా చైర్ అంపైర్‌పై 'లింగ వివక్ష'.. యువ ఆటగాడికి 71 లక్షల జరిమానా..!

ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌లో 'లింగ వివక్ష' చూపించిన ఆటగాడికి భారీ జరిమానా పడింది. పెరుగ్వేకు చెందిన అడాల్ఫో వల్లెజో తన మ్యాచ్‌కు మహిళా చైర్ అంపైర్ బదులు పురుషుడిని నియమించాల్సిందని పేర్కొనడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. మహిళా అంపైర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన అతడిపై మండిపడిన నిర్వాహకులు ఏకంగా రూ.71 లక్షల ఫైన్ విధించారు. ఫ్రెంచ్ ఓపెన్‌లో చైర్ అంపైర్‌గా విధులు నిర్వహిస్తున్న అనా కర్వాల్హో పై అడాల్ఫో వల్లెజో అనుచిత వ్యాఖ్యలు చేశాడు. రెండో రౌండ్‌లో ఓటమి అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన మ్యాచ్‌కు చైర్ అంపైర్‌గా మహిళను కాకుండా పురుషుడు వ్యవహరించాల్సింది. మగవాడైతేనే ప్రేక్షకుల అరుపులను, వారి అల్లరిని అదుపు చేసేవాడు. మహిళా చైర్ అంపైర్‌కు వారిని నియంత్రించడం చాలా కష్టమైన పని అని అడాల్ఫో అన్నాడు. చైర్ అంపైర్ అనను అవమానించేలా, లింగ వివక్షపూరితంగా అతడు మాట్లాడడాన్ని ఫ్రెంచ్ ఓపెన్ నిర్వాహకులు ఖండించారు. లింగ వివక్షను




ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించమని ప్రకటిస్తూ.. అడాల్ఫోకు రూ.71 లక్షల జరిమానా విధించారు. తన వ్యాఖ్యలపై అడాల్ఫో క్షమాపణ చెప్పినా కూడా లింగ వివక్ష చూపడాన్ని సహించబోమని తేల్చేస్తూ జరిమానా కట్టాల్సిందేనని తేల్చేశారు.

**నా ఉద్దేశం వేరు**

ఓటమి బాధలో తాను చైర్ అంపైర్‌పై చేసిన వ్యాఖ్యలను మరోలా ఆర్థం చేసుకున్నారని, తనను క్షమించాలని అడాల్ఫో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టాడు. నా వ్యాఖ్యల ఉద్దేశం మీరు అనుకున్నది కాదని నేను స్పష్టత ఇవ్వాలనుకుంటున్నా. చైర్ అంపైర్లపై, వారి జాబ్‌పై నాకు గౌరవముంది. ఐదు గంటలు పోరాడి ఓడిన అనంతరం భావోద్వేగంతో నేను అలా మాట్లాడాను. అందుకు క్షమాపణలు చెబుతున్నా. నా ఓటమికి ఆమె కారణం కాదని కూడా మీకు తెలియజేస్తున్నా. మ్యాచ్ ఆసాంతం చైర్ అంపైర్‌గా అనా గొప్పగా వ్యవహరించింది. ఈ పరిణామాల ద్వారా నేను చాలా నేర్చుకున్నా. మరింత మెరుగవుతాను. రొలాండ్ గరోస్, ఫ్రెంచ్ టెన్నిస్ సమాఖ్య, టెన్నిస్‌ను ఇష్టపడే ప్రతిఒక్కరి పట్ల నాకు చాలా గౌరవముంది అని అడాల్ఫో తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఐదు గంటల పాటు సాగిన రెండో రౌండ్‌లో కౌమే(ఫ్రాన్స్) చేతిలో 6-3, 7-5, 3-6, 2-6, 7-6 (8)తో అడాల్ఫో ఓడిపోయాడు.

## ఆర్సీబీ స్టార్‌కు భారీ జరిమానా.. 20వ సీజన్ తొలి మ్యాచ్‌కు దూరం..!



ఐపీఎల్ చరిత్రలో వరసగా రెండోసారి ట్రోఫీ గెలిచిన మూడో జట్టుగా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(=జదీ)కు బిగ్ షాక్. అదిరే విజయంతో విక్టరీ సంబరాల్లో మునిగిపోయిన ఆ జట్టులోని విదేశీ ఆటగాడు టిమ్ డేవిడ్‌పై వేటు పడింది. ఐపీఎల్ నియమావళిని ఉల్లంఘించిన అతడు వచ్చే సీజన్ తొలి మ్యాచ్ ఆడకుండా నిషేధానికి గురయ్యాడు. లెవల్ 1 తప్పిదానికి పాల్పడిని డేవిడ్‌కు మ్యాచ్ ఫీజులో ఏకంగా 50 శాతం కోతతో పాటు.. రెండు డీ మెరిట్ పాయింట్లు కేటాయించారు. అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో ఆదివారం(మే 31) జరిగిన ఫైనల్లో టిమ్ డేవిడ్ ఐపీఎల్ కోడ్‌ను ఉల్లంఘించాడు. గుజరాత్ ఇన్నింగ్స్ సమయంలో 10వ ఓవర్లో అతడు ఐస్ ప్యాక్‌ను కోపంగా అంపైర్ నితిన్ మీనన్(చీఅఅ వీవఅశీఅ) వైపు విసిరాడు. ఆర్సీబీ స్టార్ తీరును తప్పుబట్టిన మ్యాచ్ రిఫరీ క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాడు. ఆర్టికల్ 2.9 ప్రకారం క్రికెట్ వస్తువులను దెబ్బతీయడం.. మ్యాచ్ అధికారి, అంపైర్, రిఫరీలను గాయపరిచేలా ప్రవర్తించడం వంటి వాటిని నేరంగా పరిగణిస్తారు. ఇన్నింగ్స్ మధ్యలో డేవిడ్ కోపంగా అంపైర్ నితిన్ వైపు ఐస్ ప్యాక్ విసరడం కూడా ఆర్టికల్ 2.9 కిందకే వస్తుంది. దాంతో.. అతడికి మ్యాచ్ ఫీజులో సగం కోత విధించారు. ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్‌లో అభ్యంతరమైన సంజ్ఞలతో ఒకటి, 54వ మ్యాచ్‌లో రెండు డీమెరిట్ పాయింట్లకు తోడు.. తాజా నేరానికి మరో రెండు కలిపి మొత్తం.. ఐదు డీమెరిట్ పాయింట్లు అయ్యాయి. ఫలితంగా.. 20వ సీజన్‌లో ఆర్సీబీ తొలి మ్యాచ్‌లో ఆడడానికి టిమ్ డేవిడ్‌ను అనర్హుడిగా ప్రకటించారు.



ఆకర్షణీయవైన క్లోజ్-అప్ గ్లామ్‌తో మెరిసే టీల్ లుక్‌లో శ్రీముఖి అబ్బురపరుస్తుంది

## సింగం 4: అక్కడ దేవగన్ - ఇక్కడ సూర్య భారీ ప్లాన్స్!



బాలీవుడ్ లో అత్యంత విజయవంతమైన యాక్షన్ ఫ్రాంచైజీలలో ఒకటైన -సింగం- సిరీస్ నుండి తదుపరి భాగం -సింగం 4- రూపొందుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ లో భాగంగా గత ఏడాది దీపావళికి విడుదలైన -సింగం అగైన్- చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు 390 కోట్ల వసూళ్లతో ఒక మోస్తరు విజయాన్ని అందుకుంది. అయితే ఆ చిత్రానికి వచ్చిన మిశ్రమ స్పందనను దృష్టిలో ఉంచుకుని దర్శకుడు రోహిత్ శెట్టి- యాక్షన్ స్టార్ అజయ్ దేవగన్ ఈ నాలుగో భాగాన్ని మరింత పకడ్బందీగా పాత -సింగం- తరహా బ్రాండ్ మాస్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి స్క్రిప్ట్ పనులను వేగవంతం చేశారు.

గత చిత్రం -సింగం అగైన్- లో మల్టీస్టారర్ కాన్సెప్ట్..ఎక్కువ మంది హీరోల క్రాస్‌ఓవర్ల కారణంగా బాజీరావ్ సింగం - ఒరిజినల్ అగ్రెసివ్ క్యారెక్టరైజేషన్ కొంత తగ్గిందనే విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకున్న అజయ్ దేవగన్ ఈసారి -సింగం 4- లో ప్రేక్షకులు కోరుకునే ప్యూర్ మాస్ యాక్షన్, పవర్‌ఫుల్ డైలాగ్స్ .. ఒళ్లు గగుర్పొడిచే ఒరిజినల్ సింగం మార్కు ఇంటెన్సిటీని మళ్లీ పునరావృతం చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి సోలో హీరో ఎలిమెంట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత లభించే అవకాశం ఉంది.

మరోవైపు సౌత్ సినీ ఇండస్ట్రీలోనూ ఇదే టైటిల్‌తో మరో క్రేజీ ప్రాజెక్ట్ సిద్ధమవుతుండటం విశేషం. కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో డైరెక్టర్ హరి తెరకెక్కించిన సూపర్ హిట్ తమిళ -సింగం- ఫ్రాంచైజీకి కూడా నాలుగో భాగం -సింగం 4- కోసం కథాచర్చలు జరుగుతున్నట్లు దర్శకుడు హరి అధికారికంగా ధృవీకరించారు. గతంలో ప్రాంతీయ, అంతర్జాతీయ నేరగాళ్లను వేటాడిన దురైసింగం పాత్రను ఈసారి మరింత వైవిధ్యమైన కథనంతో.. సరికొత్త విలన్లతో పాన్-ఇండియా రేంజ్‌లో భారీ స్థాయిలో ఆవిష్కరించేందుకు సూర్య, హరిల కాంబో సన్నాహాలు చేస్తోంది.

అక్కడ బాలీవుడ్ లో సింగం ఫ్రాంచైజీలో కొత్త సినిమా దేవగన్ తో తెరకెక్కిస్తే.. అదే సమయంలో సూర్య హీరోగా హరి కూడా బరిలో దిగుతున్నారు గనుక ఈ ఫ్రాంచైజీ మరోసారి నిరంతరం వార్తల్లో నిలవడం ఖాయం. దానికి తగ్గట్టే ఫ్యాన్స్ లోను అంతే క్రేజ్ నెలకొంటుంది. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి కాస్టింగ్, అఫీషియల్ అనౌన్స్‌మెంట్.. షూటింగ్ షెడ్యూల్ వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.



సన్యా మల్హోత్రా అద్భుతమైన బ్లాక్ స్టూడియో ఫోటోషూట్‌లో రా గ్లామర్‌ను ప్రదర్శించింది

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com